RNI APTEL/25/A0798

# టుడే విధుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:69 11-10-2025 శనివారం ఎడిటర్ :మర్రి పవన్ పేజీలు : 8 వెల 4 /

## వయనాడ్ బాధితుల కోసం

# నిధులు విడుదల చేయాలి



న్యూఢిల్లీ, అక్టోబర్ 10(టుడే విదుర) : వయనాడ్ విపత్తు బాధితుల పునరావాసం కోసం ఒకేసారి మొత్తంగా నిధులను విడుదల చేయాలన్న డిమాండ్‌ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పునరుద్ఘాటిం చారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రక్షించేందుకు, అభివృద్ధిని బలోపేతం చేసేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మరియు సామాజిక సంక్షేమ ఆకాంక్షల సాకారం కోసం కేంద్రం జోక్యం చేసుకోవాలని ప్రధాని మోడీని కోరినట్లు తెలిపారు. కేంద్రంలోని పాలక ప్రభుత్వం, కేరళ మధ్య ఉన్న రాజకీయ విభేదాలను పక్కన పెట్టేందుకు యత్నించామని అన్నారు. ఈ ప్రయత్నాన్ని సానుకూల, ఆరోగ్యకరమైన, ఆశాజనకమైన మరియు నిశ్చయాత్మక చర్యగా అభివర్ణించారు. జాతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు నిరంతరం నిర్మాణాత్మక ప్రమేయం కలిగి ఉంటాయని అన్నారు. ఎత్తుపల్లాలు ఉండవచ్చని కానీ ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు బహిరంగంగా మరియు బలంగా ఉంటాయని అన్నారు. ఒకపార్టీని మరో పార్టీ దూరంగా ఉంచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. కేరళ ప్రభుత్వం కేంద్రంతో తమ అవసరాలను వెల్లడిస్తూనే ఉంటుందని, రాష్ట్రం ఎప్పుడూ ఆశను కోల్పోదని అన్నారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

# రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం



మిగతా 2లో...

అమరావతి,అక్టోబర్ 10(టుడే విదుర): ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ మేరకు(శుక్రవారం) సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంపై ఆయన మాట్లాడారు. ఇవాళ జరిగిన క్యాబినెట్ రాష్ట్ర ఆర్థిక పురోగతికి, ఏఐ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ఐపీబీ మీటింగ్‌లో చర్చించిన నిర్ణయాలకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి స్పష్టం చేశారు.గడిచిన 15 నెలల కాలంలో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సుకు అనేక పాలసీలు ఇచ్చామని కొలుసు పార్థసారథి తెలిపారు. వివిధ పాలసీలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇచ్చి రూ.1.17లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సుమారు 70 వేల ఉద్యోగాలు వచ్చేలా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

## వైద్య విద్యలో పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యం..



అమరావతిఅక్టోబర్ 10 (టుడే విదుర): మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం వెళ్లి గోడలు, ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు చూసి వచ్చారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. వాటిని చూసి ఆహా.. ఓహో.. అంటూ ప్రజల్ని మోసం చేసే విధంగా డ్రామాలు ఆడారని ఆరోపించారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్‌కి అమ్మేయడం కాదు.. పనుల్లో ప్రైవేట్ సహకారం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కాలేజీల నియంత్రణ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. మిగతా 2లో...

# విశాఖ ఇక మినీ ముంబై...

## ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

- రూ. 1.17 లక్షల కోట్ల భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ ఆమోదం!
- విశాఖను ముంబై తరహాలో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయం
- గూగుల్, టీసీఎస్ వంటి సంస్థల రాకతో మారనున్న విశాఖ స్వరూపం
- అమరావతిలో రూ. 212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు
- పెట్టుబడులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఉద్యోగుల డీఏ, భూ కేటాయింపుల అంశాలపై కూడా కేబినెట్‌లో చర్చ



అక్టోబర్ 10(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, అభివృద్ధి ప్రస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రానికి రూ. 1.17 లక్షల కోట్ల విలువైన భారీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇవ్వడంతో పాటు, వేలాది ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతాయని భావిస్తున్నారు. మిగతా 2లో...

## జగన్ ఐదేళ్లలో

# వేల కోట్లు దోచుకున్నారు..

## యామిని శర్మ ఫైర్



విజయవాడ,అక్టోబర్ 10(టుడే విదుర): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఐదేళ్లలో వేల కోట్లు దోచుకున్నారని.. ఇంకా సరిపోలేదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్‌కి ఐదేళ్ళు అధికారం ఇస్తే... ఏమి చేయలేక.. ఇప్పుడు తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మిగతా 2లో...

## అన్నపర్రు బీసీ హాస్టల్ ఘటన..

## మంత్రి సవిత ఆరా..



గుంటూరు, అక్టోబర్ 10(టుడే విదుర): గుంటూరు జిల్లా అన్నపర్రు బీసీ హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సవిత ఆదేశాల నేపథ్యంలో బీసీ వెల్ఫేర్ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, కలెక్టర్ తమీమ్ అన్సారియా పెదనందిపాడు పీహెచ్సీకి వెళ్లారు. విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు డైరెక్టర్ మల్లికార్జున మంత్రి సవితకు తెలిపారు.నేటి సాయంత్రానికి విద్యార్థులను డిశ్చార్జ్ చేస్తారని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో మిగిలిన విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండమన్నారు. కాచి చల్లార్చిన తాగునీరు, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు. తాగునీరు, ఆహారం శాంపిల్లను వైద్య పరీక్షల కోసం పంపి నివేదిక ఇవ్వాలని మంత్రి సవిత అన్నారు.

# కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం





ఢిల్లీ, అక్టోబర్ 10(టుడే విదుర): ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న అమిర్‌ఖాన్ ముత్తాఖీతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు రెండు దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం మళ్లీ తెరుస్తామని ఈ సందర్భంగా జైశంకర్ ప్రకటించారు.ఉగ్రవాదాన్ని ఏరివేసేందుకు ఇరు దేశాలు కలిసి పోరాటం చేస్తాయని ఇరుదేశ విదేశాంగ నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించిన జైశంకర్.. సీమాంతర ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న కొన్ని దేశాలకు త్వరలోనే తగిన బుద్ది చెబుతామని వార్నింగ్ ఇచ్చారు.భారతదేశ భద్రతా సమస్యల పట్ల ఆఫ్ఘనిస్తాన్ చూపిస్తున్న సున్నితత్వాన్ని, సంఘీభావాన్ని భారత్ అభినందిస్తుందని జైశంకర్ పేర్కొన్నారు. ఇక, ఆఫ్ఘనిస్తాన్ ఎక్సలెన్సీ, వృద్ధి, శ్రేయస్సు పట్ల తమ దేశానికి నిబద్ధత ఉందని జైశంకర్ తెలిపారు. అయితే, రెండు దేశాలు ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదపు ఉమ్మడి ముప్పు వల్ల ఇవి ప్రమాదంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. అలాగే, ఆఫ్ఘనిస్తాన్ స్థిరత్వానికి భారతదేశం దీర్ఘకాలంగా మద్దతు ఇస్తుందని జైశంకర్ హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్తాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతతో పాటు ఆ దేశ స్వాతంత్ర్యానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం.. జాతీయ అభివృద్ధికి, అలాగే ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడుతుందని జైశంకర్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

## రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

అలాగే టాటా పవర్ రెన్యూవబుల్ లిమిటెడ్ ప్లాంటు, చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తోటపల్లి బ్యారేజి నుంచి 24 ఎంసీఎం నీటి ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీనితో పాటు ఎవాపరేషన్ లాసెస్‌కు కూడా నీటిని కేటాయించినట్లు తెలిపారు. రిలయన్స్ కన్సూమర్ ప్రొడెక్ట్‌ల కింద కర్నూలు జిల్లాలో రూ.758 కోట్లతో ప్యాక్టరీ నెలకొల్పడానికి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 500 మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. టూరిజం పాలసీ ఒక గేమ్ ఛేంజర్ అందుకే దానిపై కేబినెట్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. దానికోసం ప్రత్యేకమైన ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేయలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

# విశాఖ ఇక మినీ ముంబై...

## ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఈ కేబినెట్ సమావేశంలో విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విశాఖను దేశ ఆర్థిక రాజధాని ముంబై తరహాలో ఒక శక్తివంతమైన ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు విశాఖకు వస్తున్నాయని, నగరాన్ని ఒక అంతర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులతో విశాఖ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అమరావతి నిర్మాణ పనులకు వేగం

రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో రూ. 212 కోట్ల అంచనా వ్యయంతో నూతన రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీంతో పాటు, రాజధాని పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన నిధులలో 25% సీఆర్డీఏ (%జ=ణూ%) ద్వారా కేటాయించాలని నిర్ణయించారు. ఈ చర్యలతో రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన మరింత ముందుకు సాగనుంది. వీటితో పాటు పలు సంస్థలకు అవసరమైన భూ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కరువు భత్యం (డీఏ) వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

## వైద్య విద్యలో పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్

వైద్య విద్యలో నాణ్యత పెంచడం, పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రతి మెడికల్ కాలేజీలో 50% సీట్లు పేద విద్యార్థులకే కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే.. పేద విద్యార్థులకు అదే కేటాగిరి కింద రూ.15 వేల కేటాయించబడతాయని చెప్పారు. పీపీపీ పద్ధతిని నేషనల్ మెడికల్ కమీషన్ చైర్మన్ డాక్టర్ అభిజాత్ సేట్ సమర్థించారని గుర్తు చేశారు. వైద్య విద్యను ముందుకు తీసుకువెళ్లాలంటే పీపీపీ సరైన దారి అని ఎన్ఎంసీ స్పష్టం చేసిందని వెల్లడించారు.

# జగన్ ఐదేళ్లలో వేల కోట్లు దోచుకున్నారు..

## యామిని శర్మ ఫైర్

దేశంలో జీఎస్టీ 2.0 ఫలితాలతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇవాళ (శుక్రవారం) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు యామిని శర్మ. పీపీపీ విధానం ద్వారా మెడికల్ కాలేజీలని అభివృద్ధి చేస్తే జగన్ అండ్‌కో కు వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో కోర్టు జగన్‌కి మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం జగన్‌కి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. నిన్న మెడికల్ కాలేజీ మొండి గోడలు చూడటానికే జగన్ వెళ్లారని ఆక్షేపించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామని పేర్కొన్నారు యామిని శర్మ.

# ఆరోగ్యశ్రీపై కుట్ర జరుగుతోంది...


## పాత విధానంలోనే కొనసాగించాలి: షర్మిల

**ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్న షర్మిల ప్రైవేట్ బీమా ముసుగులో పథకాన్ని నీరుగార్చుతున్నారని విమర్శలు నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2700 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్**

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం భారీ కుట్రకు పాల్పడుతోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రైవేట్ ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టడం వెనుక, పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా చంపేసే దురుద్దేశం దాగి ఉందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీని ఒక దైవవరంగా తీసుకొస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని నిర్వీర్యం చేస్తూ రాక్షసుడిలా వ్యవహరిస్తున్నారని షర్మిల విమర్శించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2,700 కోట్ల బకాయిలు పేరుకుపోవడం వల్లే, ఆయా ఆసుపత్రులు సమ్మెకు దిగాయని, నెల రోజులుగా ఓపీ సేవలు నిలిచిపోయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు.

# ఉరేసుకున్న తల్లి..

# కాపాడేందుకు 13 ఏళ్ల బాలుడి యత్నం



అక్టోబరు 10 (టుడే విదుర):: ఈ భూమి మీద అమ్మపై ప్రేమలేని వారు ఉండరు. ఇక తల్లి కోసం ఏదైనా చేసేందుకు చాలా మంది బిడ్డలు ఉంటారు. అయితే తాజాగా తన తల్లి ప్రాణాలు కాపాడేందుకు ఓ బాలుడు చేసిన ప్రయత్నం అందరని కంటతడి పెట్టించింది. కళ్లెదుటే తల్లి ఉరేసుకుంటుంటే అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడు ఆమెను రక్షించేందుకు శతవిధాల ప్రయత్నించినా కాపాడుకోలేకపోయాడు. ఈ ఘటన హైదరాబాద్ లో చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన సుధ(42), నర్సింహ దంపతులు బతుకుదెరువుకు 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చారు. నాలుగేళ్లుగా వనస్థలిపురం సమీపంలోని మారుతీనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వీరికి 18, 13 వయసున్న ఇద్దరు కొడుకులు ఉన్నారు. భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్న నర్సింహ మద్యానికి బానిసయ్యాడు. సుధ ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. మరోవైపు చిన్న కుమారుడికి మధుమేహం సమస్య ఉంది. వైద్యం చేయించే స్తోమత లేక సుధ తీవ్ర మనోవేదనకు గురయ్యేది. అలానే ఇటీవల పెద్దకొడుకు పక్కింట్లో ఇనుప రాడ్డు చోరీ చేయగా ఆ యజమాని మందలించాడు. సుధ మనస్తాపానికి గురైంది. ఈ బాధలన్నింటినీ పక్కింటి మహిళతో పంచుకొని కన్నీరు పెట్టుకుంది. రాత్రి భర్తలేని సమయంలో పెద్ద కుమారుడిని పెరుగు తీసుకురమని బజారుకు పంపింది. చిన్న కుమారుడు చూస్తుండగానే సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుంది. ఆ బాలుడు అనారోగ్యంతో బాధపడుతూనే ఫ్యానుకు వేలాడుతున్న తల్లి కాళ్లు పట్టుకుని ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నించాడు. తన చేతిలోనే తల్లి ప్రాణాలు వదలటంతో అమ్మా.. అమ్మా.. అంటూ రోదించాడు. తిరిగొచ్చిన పెద్ద కుమారుడు స్థానికుల సాయంతో తల్లిని కిందకి దింపి 108లో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించినా ఆమె చనిపోయిందంటూ వైద్యులు ధ్రువీకరించారు.

# పండుగ అయిపోయి వారం రోజులైనా..

# దసరా మామూళ్ల గోల తగ్గడం లేదుగా..



**- దసరా మామూళ్ల టార్గెట్ రూ.అరకోటి**

**- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఫోన్‌కాల్స్**

**- ఒక్కో రేషన్ డీలర్ రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్**

**- పేపర్ రోల్స్ ఇవ్వాలంటే తప్పని మామూళ్లు**

అనంతపురం:అక్టోబరు 10 (టుడే విదుర):: పండుగ అయిపోయి దాదాపు వారం రోజులవుతున్నా దసరా మామూళ్ల గోల తగ్గడం లేదు. జిల్లాలో రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే మండల లెవల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్)లకు ఇంకా దసరా మామూళ్లు అందలేదట. దీంతో త్వరగా పంపాలంటూ తెగ ఫోన్లు కొడుతున్నట్లు సమాచారం. ప్రతి రేషన్ డీలర్ రూ.3వేలు చొప్పున ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది. సమయం, సందర్భం లేకుండా మామూళు వసూళ్లు చేస్తుండటంపై రేషన్‌షాపు డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1645 రేషన్ షాపులున్నాయి. ఒక్కో డీలర్ నుంచి రూ. మూడు వేలు ప్రకారం మొత్తం షాపుల నుంచి రూ.49.35లక్షలు వసూలవుతుంది. అదే స్థాయిలో జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్లున్నాయి. ఒక్కో పాయింట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఆరేడు మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో డీటీ కాకుండా మిగిలిన వారి నుంచి గత కొన్ని రోజులుగా రేషన్ షాపు డీలర్లకు ఫోన్ కాల్స్ వెళ్తున్నాయి. దసరా మామూలు కింద రూ.3వేలు పంపండి అంటున్నారట. రూ.1000లు పంపుతామని ఎవరైనా డీలర్ అంటే అలా కుదరదబ్బా...మేమేమైనా ప్రతి నెలా అడుగుతున్నామా..? దసరా కొక్కటే కదా అని ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు నేరుగా నగదు అందిస్తుండగా మరికొందరు ఫోన్‌పే ద్వారా పంపుతున్నట్లు తెలిసింది. డీలర్లు సరిగా స్పందించకపోతే కొన్ని స్టాక్ పాయింట్ల నుంచి నలుగురైదు గురు సిబ్బంది ఒకే డీలర్‌కు ఫోన్ చేస్తున్నారట. వసూలు చేసిన మొత్తం అంతా ఎంఎల్ఎస్ పాయింట్లలోనే పంచేసుకుంటున్నారా...?లేక ఉన్నతాధికారులకు వాటా ఇస్తున్నారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ మామూళ్ల వ్యవహారంపై కొందరు డీలర్లు ఇదేందబ్బా ఇలా ఎన్ని పేర్లతో వసూలు చేస్తారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అధికారపార్టీకి చెందిన ఓ రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధి వస్తున్నారంటూ ఒక్కో డీలర్ నుంచి ఒక్కో పీడీఎస్ బియ్యం బస్తా తీసుకెళ్లారట. కానీ ఆ కార్యక్రమం రద్దయింది. కానీ ఆ బస్తాలు వెనక్కు రాలేదు. ఆ బియ్యం బస్తాలు అమ్మేసుకుని వచ్చిన సొమ్ము జేబులోకి వేసుకున్న ఘనులెవరో...? ఈ బస్తాలేమయ్యాయో డీఎసఓకు, సీఎసడీటీలకూ తెలిసే ఉంటుందనే విమర్శలున్నాయి. ఇక హమాలీలు దసరా మామూళ్లు రూ.1000ల నుంచి 2వేల వరకు అడుగుతున్నారట. ఇప్పటికే వారు స్టాక్ అన్‌లోడ్ చేసిన సమయంలో వసూలు చేసినట్లు తెలిసింది.

# అమ్మా వెళ్లి వస్తా..



ఆస్పరి, అక్టోబరు 10 (టుడే విదుర):: హాస్టల్ ఉండి చదువుకుంటున్న కొడుకు దసరా సెలవులకు ఇంటికొచ్చాడు.. సెలవులంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపాడు.. ఎంతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.. ఇంతలోనే సెలవులు ముగిశాయి.. బడులు తెరుచుకున్నాయి.. 'అమ్మా వెళ్లి వస్తా.. అక్క.. చెల్లి జాగ్రత్త..' మళ్లీ సెలవుల్లో వస్తా.. అంటూ తల్లి, అక్క, చెల్లితో అన్న చివరి మాటలు.. ఇక కొడుకును తీసుకొని పాఠశాలలో వదిలేందుకు బైక్‌పై తండ్రి బయలుదేరారు. తండ్రీకొడుకులు మాట్లాడుకుంటూ ఒక గంట పాటు ప్రయాణాన్ని సాఫీగా సాగించారు.. ఇంకో గంటల్లో వారు తమ గమ్యస్థానానికి చేరుకునే వారు.. అంతలోనే అతివేగంతో ఎదురుగా లారీ రూపంలో మృత్యువు వచ్చి వారి కబళించింది. ఈ ప్రమాదంలో విద్యార్థి శ్రీనివాసులు(14) అక్కడికక్కడే చనిపోయాడు. తండ్రిని కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటన ఆస్పరి మండలంలోని బిల్లేకల్ గ్రామ సమీపంలో చోటుచేసుకున్నట్లు సీఐ మస్తాన తెలిపారు. వివరాలు.. క్రిష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన మాల దాసరి శ్రీనివాసులు(14) అరికెర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు నిమిత్తం గ్రామానికి వచ్చాడు. సెలవులు ముగియగా తండ్రి మాల దాసరి మహేష్(45)తో కలిసి బైక్‌పై పాఠశాలకు పయనమయ్యాడు. బిల్లేకల్ గ్రామ సమీపంగా చేరుకున్నారు. బళ్లారి వైపు నుంచి కర్నూలుకు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థి శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన దాసరి మహేష్‌ను కర్నూలు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య రామేశ్వరమ్మ, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రీకొడుకు మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు

# 4జీ టవర్ల పనులు చేపట్టండి




పార్వతీపురం, అక్టోబరు 10 (టుడే విదుర)::జిల్లాలో గుర్తించిన గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్, జియో 4జీ టవర్ల ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సంబంధిత నెట్‌వర్క్ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలో 4జీ టవర్ల ఏర్పాటుపై బీఎస్ఎన్ఎల్, జియో ప్రతినిధులతో పాటు సబ్ కలెక్టర్లు, ప్రత్యేక ఉపకలెక్టర్లు, తహసీల్దార్లు, ఇంజనీర్లు, అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరాడ మండలంలోని బద్దిడి, ఊటకోసు, తినుకు, ఊలిగేసు, వనబడి గ్రామాలు, సాలూరు మండలంలోని చోర, సురాపాడు, లోలింగభద్ర, గుమ్మలక్ష్మీపురం మండలంలోని వడబాయి, బయ్యాడ గ్రామాల్లో టవర్ల ఏర్పాటుకు సర్వే చేసినట్లు తెలిపారు. ఈ పది గ్రామాల్లో టవర్లకు సంబంధించిన మెటీరియల్‌ను వాహనాల్లో తీసుకెళ్లేందుకు రహదారి పనులు చేపట్టాలన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవకాశం లేకపోతే వాటికి బదులుగా ప్రత్యామ్నాయ గ్రామాలను గుర్తించి తక్షణమే ఆ వివరాలను తనకు పంపాలని జేసీ అధికారులను ఆదేశించారు.

# పిచ్చికుక్క స్వైరవిహారం



రావికమతం,అక్టోబరు 10 (టుడే విదుర):: మండల కేంద్రంలో అర్ధరాత్రి,ం ఉదయం ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. కనిపించిన వారందరిపైనా దాడి చేసి కరిచింది. దీంతో జనం బెంబేలెత్తిపోయారు. రెండేళ్ల చిన్నారి నుంచి 75 వృద్ధుడి వరకు మొత్తం 27 మందికి పిచ్చికుక్క కాట్లు వేసింది. వీరిలో సగం మంది బీసీ వసతి గృహం బాలికలే వున్నారు.

రావికమతం బీసీ బాలికల వసతి గృహంలోకి అర్ధరాత్రి దాటిన తరువాత రెండున్నర గంటల సమయంలో పిచ్చికుక్క చొరబడింది. ఈ సమయంలో గాఢ నిద్రలో వున్న బాలికలపై దాడి చేసింది. దీంతో వారంతా పెద్దగా కేకలు వేసి, తలో దిక్కుకు పరుగులు తీశారు. అయినాసరే కుక్క వెంటపడి కాళ్లు, చేతులు, ముఖంపై కరించింది. వెలంకాయల పావని, కుడే సౌజన్య, కోన ప్రసన్న, చొప్పగండి పూజిత, పోతల మోక్షిత దుర్గ, వడ్డి నవ దుర్గ, సుంకర స్వప్న, మరిశా భావ్యశ్రీ, కె.స్వాతి, కిర్లంపల్లి దుర్గా భవానీ, పినబోయిన తనూజ, తేగాడ గీత కుక్కకాటుకు గురయ్యారు. పిచ్చికుక్క మళ్లీ గురువారం ఉదయం రావికమతంలో గర్నికం గ్రామానికి చెందిన ఆర్లె దేముడు, కేశంశెట్టి నాగమణి, మేడివాడకు చెందిన మీసాల చరణ్, సంపతి అన్నపూర్ణ, కుముదానిపేటకు చెందిన కోల నవీన్ ప్రసాద్, రావికమతానికి చెందిన వెచ్చా విశ్వ, సంపతి రమణమ్మ, ఎండీ దావూద్ అలం, బండారు అచ్యుతరావు, గోకాడ శ్రీరామమూర్తి, మైచర్ల కృష్ణమ్మలపై దాడిచేసి గాయ పరిచింది. అక్కడి నుంచి రావికమతం పక్కనే ఉన్న నాగన్నపాలెం వెళ్లి ఒక ఇంట్లోకి చొరబడి రెండేళ్ల బాలుడు కడులూరి చైతన్య వర్దన్‌ను నోట కరుచుకుని బయటకు ఈడ్చుకొచ్చింది. చెవి, తలపైన కరిచి గాయపరిచింది. కుక్కకాటు బాధితులు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన రెండేళ్ల బాలుడు చైతన్య వర్దన్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పంపారు. ఎంపీడీవో మహేశ్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, ఎంఈఓ-2 బ్రహ్మాజీ ఆస్పత్రికి వెళ్లి పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. కాగా పిచ్చికుక్కను గురువారం మధ్యాహ్నం నాగన్నపాలెంలో గుర్తించి, కర్రలతో కొట్టి హతమార్చారు. కాగా పిచ్చికుక్క దాడిలో 27 మంది గాయపడిన విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారులకు వీడియో కాల్ చేసి ఆరా తీశారు

# ప్రేమ పేరుతో మోసగించిన యువకుడు




బూర్జ (ఆమదాలవలస), అక్టోబరు 10 (టుడే విదుర):: ప్రేమ పేరుతో ఓ గిరిజన బాలికను మోసగించిన ఘటన బూర్జ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బూర్జ మండలంలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను సవర పవన్‌కుమార్(20) కొంతకాలంగా ప్రేమిస్తున్నట్టు, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆ బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో అతడిని నిలదీశారు. ఈ విషయంలో తనకు సంబంధం లేదని తప్పించుకు నేందుకు పవన్ కుమార్ యత్నించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బూర్జ ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

# సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు



రాజమహేంద్రవరం అర్బన్,అక్టోబరు 10 (టుడే విదుర):: వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేశారని, కూటమి అ?ధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే హాస్టళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం గణేష్‌చౌక్‌లోని బీసీ బాలికల వసతిగృహాన్ని స్థానిక నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో బాలికలకు అందుతున్న సౌకర్యాలు, రక్షణ చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో హాస్టల్‌లోని 20 మరుగుదొడ్లు అధ్వానంగా ఉండేవని, వందమంది బాలికలకు రెండు మాత్రమే పనిచేసేవని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎస్ఆర్ నిధులతో వసతిగృహంలో మరుగుదొడ్లు బాగు చేయించి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే వై.జంక్షన్‌లోని బాలుర వసతిగృహంలోనూ, ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని ఎస్టీ వసతిగృహంలోనూ సీఎస్ఆర్ నిధులతో సదుపాయాలు, మరుగుదొడ్లు మరమ్మతులు చేయించామని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. గణేష్‌చౌక్ రైతు బజార్ వెనుక కొందరు ఆకతాయిలు మద్యం, మాదకద్రవ్యాలు తాగడం తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, స్థానిక వ్యాపారులు ఈ బాధ్యత తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సుబ్బారావు, వార్డెన్ సత్యవాణి, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# లాడ్జీలపై పోలీసుల మెరుపు దాడులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 10 (టుడే విదుర):: చిత్తూరు నగరంలోని పలు లాడ్జీలపై రాత్రి పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. వివరాలను ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలియజేశారు. నగరంలోని వినాయక లాడ్జిపై దాడి చేసి.. నిర్వాహకుడు వెంకటేష్, రూమ్ బాయ్ రవితోపాటు ముగ్గురు మహిళలను, విటుడు అజీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే గణేష్ లాడ్జిపై దాడి చేసి.. మేనేజర్ ఉమాపతి, రూమ్ బాయ్ సురేంద్రబాబుతో పాటు రూముల్లోని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మాధవ అనే వ్యక్తి పారిపోయాడు. విచారించగా.. మహిళలంతా హైదరాబాదు, శ్రీకాకుళం, నెల్లూరు, విజయవాడ నుంచి కూలి పనుల కోసం ఇక్కడికి వచ్చినట్లు గుర్తించారు. వీరికి డబ్బు ఆశ చూపి వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలడంతో వెంకటేష్, రవి, ఉమాపతి, సురేంద్రబాబు, విటుడు అజీమ్‌లపై కేసు నమోదు చేసి గురువారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు నాల్గవ అదనపు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది.

# నేత్రాలకు విశ్రాంతి ఇవ్వాలి

అనంతపురం వైద్యం, అక్టోబరు 10 (టుడే విదుర):: మానవదేహంలో ప్రధానమైన నేత్రాలకు విశ్రాంతినివ్వాలి. నిరంతరాయంగా మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగం. వెలుతురులేని ప్రదేశాల్లో అధికసమయం ఉండటం వంటి అంశాలు నేత్రాలకు నిరంతర శ్రమలాంటిది. వీటికి దూరంగా ఉండేలా ప్రయత్నించాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి, కంటి వైద్యనిపుణుడు డాక్టర్ సైదన్న తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'మీకళ్లను ప్రేమించండి' అనే నినాదంతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సైదన్నతో పాటు కంటి విభాగాధిపతి డాక్టర్ కస్తూరి, డాక్టర్ మంజుల, ఇనచార్జ్ ఏడీ డాక్టర్ సౌజన్య కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం సిబ్బందిని ఘనంగా సన్మానించారు.




# షెడ్డే గూడు.. చెట్టే నీడ!

**సొంతగూటికి నోచుకోని మందస అగ్నిమాపక కార్యాలయం**

**పదిహేనేళ్లగా శిథిల భవనంలోనే..**

**బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు**

**పట్టించుకోని ఉన్నతాధికారులు**



హరిపురం, అక్టోబరు 10 (టుడే విదుర):: అగ్నిప్రమాద సమయాల్లో ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్న అగ్నిమాపక కార్యాలయానికి సొంత గూడు కరువైంది. సుమారు పదిహేనేళ్ల కిందట మందస కేంద్రంగా అగ్నిమాపక కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో శిథిలవ్వైన షెడ్డులా మిగిలిపోయిన మండల కార్యాలయ సిబ్బంది క్వార్టర్స్‌లోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక అప్పటి నుంచి బితుకు బితుకుమంటూ అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వాహనం ఉంచేందుకు నిలువు నీడలేక చెట్టుకిందనే నిలుపుతున్నారు. ఏ సమయంలో ఏం ప్రమాదం ముంచుకుస్తోందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళు ్లగా తుఫాన్లు, అనంతరం ఏర్పడిన భారీ వర్షాలు సమయంలో వీరి సేవలు అత్యుత్తమంగా నిలిచాయి. వీరి సేవలను కొనియాడుతూ పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. కానీ వీరికి పదిహేనేళ్లుగా వేధిస్తున్న వసతి సమస్య మాత్రం తీరడం లేదు. ఇదే విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు వేడుకోవడంతో నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత నిర్మిస్తాం అంటూ చెబుతున్నారే తప్పా.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. దీంతో ప్రజల ఆస్తులను రక్షించే తమకే రక్షణ కరవైందని వారంతా నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనం ఏర్పడితే తమ సేవలు మరింత విస్తృతం చేసి, విధి నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఫోన్ చేసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంటామని మందస అగ్నిమాపక కేంద్రం సూపర్‌వైజర్ బాడ వల్లభరావు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

# డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



కౌతాళం, అక్టోబరు 10 (టుడే విదుర):: విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి సంతోషకరమైన జీవితాలను గడుపుదామని కర్నూలు సెట్కూరు సీఈవో వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వ్యసనం- పర్యవసనాలు, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్కూర్ సీఈవో మాట్లాడుతూ నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలలో డ్రగ్స్ ఒకటని దీనివల్ల యువత చెడు వ్యసనాలకు బానిసలుగా వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తే 1972కు సమాచారం అందించాలన్నారు. అనంతరం కౌతాళం ఏఎస్ఐ రమణా రెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్లలకు సైబర్ మోసగాళ్ళు ఎస్ఎంఎస్ ద్వార లింక్‌లను పంపుతూ మోసాలు చేస్తుంటారని, కొత్త నెంబర్ల నుంచి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డేవిడ్, సెట్కూర్ పర్యవేక్షకుడు శ్యాం బాబు, హెడ్ కానిస్టేబుల్ సోమ్లు నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని వాటర్‌ప్లాంట్ల మూత

శృంగవరపుకోట, అక్టోబరు 10 (టుడే విదుర)::ఎస్.కోట ఒన్‌వే ట్రాఫిక్ సమీపంలో గల ఐశ్వర్య డ్రింకింగ్, పుణ్యగిరి రోడ్డులోని శ్రీదారగంగమ్మతల్లి రోహి వాటర్ ప్లాంట్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు లేకపోవడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నాగూల్ మీరా మూసివేయించారు. ఎస్.కోటలోని వాటర్‌ప్లాంట్లను తనిఖీచేశారు. ప్లాంట్లకు వున్న అనుమతులు చూపించాలని యజమానులను కోరారు. ఏడాది కిందట నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పొందాలని చెబుతున్నా పట్టించుకోలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అనుమతి పొందేవరకు ప్లాంట్లను తెరవద్దని ఆదేశించారు. అనంతరం పుణ్యగిరి రోడ్డులోని సబ్ జైలు ఖైదీలకు వండే వంట సరుకులను పరిశీలించారు. నాసిరకం కందిపప్పు వాడొద్దని, మెదటి రకం కంది పప్పును వాడాలని సూచించారు. స్థానికుల పిర్యాదు మేరకు విశాఖ-అరకు రోడ్డులో గల మిస్సెస్ లక్ష్మీ నారాయణ ట్రెడర్స్‌ను తనిఖీ చేశారు. అక్కడ డబ్బాల్లో వున్న ఆయిల్ శాంపిల్‌ను సేకరించి, హైదరాబాద్‌లోని నాచారం పంపి స్తామని చెప్పారు. అక్కడ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఈ ట్రేడర్స్ యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి



చాగలమర్రి,అక్టోబరు 10 (టుడే విదుర):: ఈ ఏడాది ఉల్లి పంట రైతుకు కన్నీటిని మిగిల్చింది. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధర లేక రైతన్నలు దిగాలు చెందుతున్నాడు. చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో ఎదురు నర్సమ్మ అనే మహిళా రైతు 1.50 ఎకరాలు, శీలం శివనాగిరెడ్డి 3 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ధర లేకపోవడంతో పొలంలోనే కుప్పలుగా పోసిన ఉల్లిగడ్డలను వదిలేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను తీసుకెళ్లారు. ఉల్లిగడ్డలను కోసి మార్కెట్ తీసుకెళ్లే డబ్బు కూడా రైతుకు రాకపోవడంతో పంటను వదిలేస్తున్నారు. 4.50 ఎకరాల్లో రూ.3 లక్షలు దాకా పెట్టుబడి పెట్టి నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదే క్రమంలో మరో ఇద్దరు రైతులు ఉల్లి పంటను ట్రాక్టర్లతో దున్నేశారు.

# విస్కీ తాగుతూ యువకుడు మృతి

ఏలూరు క్రైం,అక్టోబరు 10 (టుడే విదుర):: పట్టణంలోని ఒక బ్రాందీ షాపు పర్మిట్ రూమ్‌లో రూ.99 మద్యం తాగుతూ ఒక యువకుడు మృతి చెందాడు. జరిగిన ఈ ఘటన ఏలూరు నగరంలో కలకలం రేపింది. యువకుడు తాగిన మద్యం బ్రాండ్ బాటిల్స్‌ను పోలీస్, ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన మేరకు... ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన మేకా అనిల్ (30) భార్య, పిల్లలను ఒదిలి కొంతకాలంగా ఏలూరులో ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. అతనికి అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. విజయవిహార్ సెంటర్ సమీపంలో ఎస్ఆర్ వైన్స్ కు(షాపు నంబర్ 4) ఉదయం 10.39 గంటలకు అనిల్ వచ్చాడు. రూ.99 రాయల్ లేన్సర్ విస్కీ తీసుకుని గ్లాసులో వాటర్ ప్యాకెట్ నీళ్లు కలుపుకుని తాగుతూ కూలబడిపోయాడు. అదే సమయంలో ఇంకో వ్యక్తి అతడి జేబులోని సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. గంట తరువాత అతను మరణించినట్లు షాపు నిర్వాహకులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు




డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ ఆవులయ్య మాట్లాడుతూ... 'కల్తీ మద్యం అని అపోహపడాల్సిన అవసరం లేదు. సంబంధిత బాటిల్స్‌లో నాణ్యమైన మద్యమే ఉంది' అని పేర్కొన్నారు.

# భారీగా పత్తి దిగుబడులు



ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 10 (టుడే విదుర)::ఆదోని వ్యవ సాయ మార్కెట్ యార్డ్ తెల్ల బంగారంతో కళకళలాడింది. రైతులు పత్తి దిగుబడులను భారీగా మార్కెట్ యార్డుకి తీసుకొ చ్చారు. 13,210 క్వింటాళ్ల పత్తిని రైతులు తెచ్చిన పత్తి దిగుబడులతో ఎటువైపు చూసిన ప్లాట్‌ఫారాలన్నీ పత్తితో కనిపిం చాయి. ధర స్వల్పంగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. 13,210 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,960, మధ్యస్తంగా రూ.7,399, గరిష్ఠంగా రూ.7,669 చొప్పున పలికింది.

# నిరుపయోగంగా జనరేటర్




మేదరమెట్ల, అక్టోబరు 10 (టుడే విదుర):: ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలు అం దించే ఉద్దేశ్యంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండడానికి రాష్ట్రప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయాల్లో లక్షలు వెచ్చించి జనరేటర్‌లను ఏర్పాటు చేసింది. విద్యుత్ కోతలతో, సరఫరాలో అంతరాయం వలన ప్రజలకు సేవలు అందుబాటులో ఉండడానికి ఈ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 660 మండలా లల్లో ప్రభుత్వం జనరేటర్లను మంజూరు చేసింది. అయితే గత ఏడు సంవత్సరాలుగా ఈ జనరేటర్లు పనిచేయడం లేదు. వీటి నిర్వహణను ఏదైన ఏజెన్సీకి అప్పగించి, నిధులు కేటాయిస్తే జనరేటర్లు పనిచేసేవి. కనీసం ఏజెన్సీ ద్వారా నిర్వహణ చేపట్టక పోవడంతో లక్షల వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్లు నిరుప యోగంగా మారాయి. ఇవి ఆరుబయట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండడంతో శిథిలావస్థకు చేరాయి.%గతంలో ముఖ్యమంత్రు లు, జిల్లా కలెకర్లు, వీడియో కాన్ఫరన్స్‌లు నిర్వహించే సమయం లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండడం కోసం, కార్యాలయాలల్లోని కంప్యూటర్లు అన్ని పని చేయాడానికి అవసరమైన సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటు చేశారు. జనరేటర్ల మాదిరిగానే వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం ప్రభుత్వం ఇచ్చిన పెద్ద పెద్ద టీవీలు మరమ్మతులతో మూలకు చేరాయి. చాలా మండలాల్లో అధికారులు తమ లాప్‌ట్యాప్ లలోనే వీడియో కాన్ఫురెన్స్‌లకు హాజరవుతున్నారు.జనరేటర్లు నిరుపయోగంగా ఉన్న విషయాన్ని కింది స్థాయి అధికారులు కలెక్టర్ దృష్టికి, కలెక్టర్ రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళితే సమస్య పరిష్కారం అవుతుంది. మరొకొన్నాళ్లు ఇదేవిధంగా వదిలేస్తే ఈ జనరేటర్‌ను పాత ఇనుము కింద అ మ్ముకోవాల్సి వస్తుంది. ఇదే వి?ధంగా మండల కార్యాలయాల్లో టీవీలు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఇప్పటికైన స్పందించి జనరేటర్లను వినియోగంలోనిక ఏత ప్రజలు కోరుతున్నారు.

# పప్పుశనగ అందించండి



కణేకల్లు, అక్టోబరు 10 (టుడే విదుర)::పప్పుశనగ సాగుచేసే అదను దాటుతోందని... వెంటనే రైతులకు పప్పుశనగ అందించి ఆదుకోవాలని హనుమాపురం సర్పంచ జయరాంచౌదరి అధికారులను కోరారు. ఎంపీపీ వంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఇప్పటికే పప్పుశనగ సాగుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని సరఫరా చేయకపోవడం శోచనీయమన్నారు. అలాగే ఈ క్రాప్ నమోదులో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. పూలచెర్లలో తాగునీటి పంపు సెట్లకు సంబంధించి రిపేరీ నిధులు విడుదల చేయలేదని సర్పంచ రవి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మారెంపల్లిలో అంగనవాడీ భవన నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చి సంవత్సరాలు కావస్తున్నా.. ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, డిప్యూటీ తహశీల్దార్ వి?శ్వనాథ్, ఏఓ జగదీష్, సర్పంచ రుద్రముని పాల్గొన్నారు.

# పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధి


తాళ్లపూడి, అక్టోబరు 10 (టుడే విదుర):: మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెలకు సోకిన వ్యాధి అంతుచిక్కలేదు.. నేటికీ గేదెలు మృతిచెందుతూనే ఉన్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడో విడతగా అనారోగ్యంతో మృత్యువాత పడు తున్న గేదెలకు మరికొన్ని పరీక్షలు నిర్వహించారు. గేదెల పేడ, మూత్రానికి పరీక్షలు చేశా రు. పశు సంవర్ధక శాఖ డీడీ డా. ఎస్.సత్య నారాయణ మాట్లాడుతూ గ్రామంలో 50 మంది రైతులు వారి గేదెలకు పరీక్షలు చేయించగా 90 శాతం గేదెల్లో పొట్ట జలగ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మృత్యువాత పడిన గేదెకు పోస్టుమార్టం నిర్వహించి జరిపిన పరీ క్షల్లో రెండు వైరస్‌లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని సుగంధి చెరువులో ఉన్న విష పూరిత అవశేషాల కారణంగా గేదెల్లో వ్యాధి నిరోధకశక్తి నశించి వైరస్ పెరుగుతుందన్నారు. వ్యాధి సోకిన గేదెలకు మిశ్రమ రోగాల నివా రణకు మందులిస్తున్నామన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ గేదెలకు రోగ నిర్ధారణ చేసి సరైన మం దులు ఇవ్వాలన్నారు.ప్రభుత్వం గేదెలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్ర మంలో కొవ్వూరు ఏడీ డా.వెంకటరెడ్డి, కాకి నాడ ల్యాబ్‌కి చెందిన డా.సందీప్, డా వెంక టేశ్వరరావు, డా ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

పరాన్నజీవులు.. వైరల్ ఇన్ఫెక్షన్ కారణం : కలెక్టర్



పెద్దేవం గ్రామంలో పాడిదేదెలు మృతికి పరాన్నజీవులు, వైరల్ ఇన్ఫెక్షన్ల సమ్మేళనమే కారణమని పరీక్షల్లో గుర్తించిన ట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.ఈ మేర కు ఒక ప్రకటన విడుల చేశారు. గేదెల ఆకస్మిక మృతిపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేసి, పశుసంవర్ధక శాఖ నిపుణుల బృందాలు క్షేత్ర పరిశీలన చేసి నిర్వహించిన నమూనాలను ప్రయోగశాలలో పరిశీలన చేయించినట్టు తెలిపారు. బాధిత పశు వులకు అవసరమైన వైద్య సహాయం, డీ వార్మింగ్, కీటక నియంత్రణ చర్యలు ప్రారంభించినట్టు చెప్పారు. గ్రామంలోని అన్ని పశు వులకు ఉచిత వైద్యం, సలహాలు అందించేందుకు మొబైల్ వెటర్నరీ టీమ్‌లను పంపినట్టు చెప్పారు.రైతులు తమ పశువుల్లో అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే సమీప వెటర్నరీ డాక్టర్లకు గానీ, గ్రామ సచి వాలయ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వా లని సూచించారు. చెరువులు, బురద ప్రాం తాల్లో పశువులను మేపవద్దని, గొర్రెలు, మేక లతో కలిపి మేపవద్దని.. జిల్లా పశుసంవర్ధక అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు.

# గూడ్స్ రైలు బోగీ లింక్ కట్



తాడిపత్రి, అక్టోబరు 10 (టుడే విదుర)::పటణ సమీపంలోని పుట్లూరు గేటు వద్ద ఓ గూడ్సు రైలు బోగీ లింక్ తెగిపోయింది. రైలు ప్రయాణిస్తున్న సమయంలో లింక్ కట్ కావడంతో రెండు భాగాలుగా విడిపోయి, ముందు భాగం దాదాపు కిలోమీటర్ దూ రం ముందుకు వెళ్లింది. ఆ సమయంలో రైల్వే గేటు వద్ద ఆగిన వాహనదారులు కేకలు వేయడంతో లోకో పైలట్ గమనించి రైలును ఆపారు. మరమ్మతు పనులు చేసిన అనంతరం రైలు తిరిగి వెళ్లిపోయింది. దీనికోసం సుమారు గంట పట్టింది. అప్పటి వరకూ రైల్వే గేటును తెరవకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

# చెరువులకు నీరందించిన ఘనత టీడీపీదే



ప్యాపిలి,అక్టోబరు 10 (టుడే విదుర):: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అని డోన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ రెడ్డి అన్నారు. మండలంలోని హుసేనాపురం, చంద్రపల్లి చెరువలకు నీరు చేరడంతో ఆయన చెరువుల దగ్గర గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ చెరువుల నీరు చేరడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. సాగునీటితోపాటు తాగు నీటి కష్టాలు కూడ తీరుతాయన్నారు. రైతులు మంచి పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. చెరువులకు నీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మె ల్యే తెలిపారు. రైతులు పథకానికి సంబంధించిన పైపులైన్లను దుండ గులు ధ్వంసం చేయకుండా తరచూ పరిశీలించాలన్నారు. చెరు వులకు నీరందించడంతో చంద్రపల్లి, హుసేనాపురం రైతులు ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, ఎస్ఐ నాగార్జున, ఆదినారాయణ, తిమ్మారెడ్డి, దామోదర్, జనార్దన, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అమానుషం.. చిన్నారిని ఇంటికి పిలిచి.. ఆపై దారుణంగా..

హైదరాబాద్,అక్టోబరు 10 (టుడే విదుర):: సమాజంలో చిన్నారులకు రక్షణ లేకుండా పోతోంది. ముక్కుపచ్చలారని చిన్నారులను సైతం కామాంధులు వదలడం లేదు. ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కామాంధుల బారిన పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి వెలుగులోకి వచ్చింది. సైదాబాద్ పరిధిలో ఈ ఘటన జరిగింది. గంజాయి మత్తులో ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు దుండగుడు. 15 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... సైదాబాద్ పరిధిలో కూతురు(8), కుమారుడు(7)లతో ఓ కుటుంబం నివసిస్తోంది.కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని దంపతులు పోషించుకుంటున్నారు. దంపతులిద్దరూ కూలీ పనులకు వెళ్లిన సమయంలో, ఇద్దరు చిన్నారులను ఇంటికి పిలిచాడు సదరు యువకుడు. సోదరుడి ముందే బాలికపై అత్యాచారానికి




పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని చిన్నారులను బెదిరించాడు నిందితుడు. ఈ క్రమంలో బాలిక అనారోగ్యానికి గురవ్వడంతో ఈ విషయం బయట పడింది. ఈ విషయం గురించి ఆరా తీయగా తల్లిదండ్రులకు వాస్తవాన్ని చెప్పాడు చిన్నారి తమ్ముడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహాయంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు తల్లిదండ్రులు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు సైదాబాద్ పోలీసులు.

## హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ రాకెట్.. సంచలన విషయాలు వెలుగులోకి..

%హైదరాబాద్, అక్టోబరు 10 (టుడే విదుర):: ఐడీఏ బొల్లారం లోని పీఎన్ఎం లైఫ్ సైన్సెస్ కంపెనీ డ్రగ్స్ కేసులో ఈగల్ టీం అధికారుల దర్యాప్తు ఇవాళ(శుక్రవారం) కూడా కొనసాగుతోంది. పీఎన్ఎం లైఫ్ సైన్సెస్ కంపెనీని సీజ్ చేశారు ఈగల్ టీం అధికారులు. నిన్న(గురువారం) జీడిమెట్లలో సుచిత్ర క్రాస్ రోడ్డు సమీపంలో సాయి దత్తా రెసిడెన్సీ ఫ్లాట్‌పై దాడి చేశారు ఈగల్ టీం అధికారులు. రూ. 72 కోట్ల విలువ చేసే 220 కిలోల ఎఫెడ్రిన్ డ్రగ్స్‌ని స్వాధీనం చేసుకున్నారు ఈగల్ టీం అధికారులు. డ్రగ్స్ కేసులో నలుగురు నిందితులని అరెస్టు చేయగా, మరోకరు పరారీలో ఉన్నాడు. ప్రధాన నిందితుడు శివ రామకృష్ణతో పాటు, అనిల్, వెంకట కృష్ణారావు, దొరబాబులని అరెస్ట్ చేశారు ఈగల్ టీం అధికారులు. పరారీలో ఉన్న ప్రసాద్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. 2024 డిసెంబర్ నుంచి పీఎన్ఎం లైఫ్ సైన్సెస్ కంపెనీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీం అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శివరామకృష్ణకి గతంలో పలు కెమికల్ కంపెనీల్లో కెమిస్టుగా పని చేసిన అనుభవం ఉంది. గతంలో రెండుసార్లు డ్రగ్స్ కేసులో శివరామకృష్ణ అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలయ్యాడు. శివరామకృష్ణ తాను చేస్తున్న ఉద్యోగం మానేసి ఆక్వా బిజినెస్ చేస్తూ డ్రగ్ తయారీకి ప్లాన్ చేశాడు. శివరామకృష్ణ ఇచ్చిన ఫార్ములా ఆధారంగానే అనిల్ డ్రగ్స్ తయారు చేసినట్లు ఈగల్ టీం అధికారులు చెబుతున్నారు. పీఎన్ఎం లైఫ్




సైన్సెస్ కంపెనీలో అనిల్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఏడో తరగతి చదివిన దొరబాబు వాల్ పెయింటర్‌గా పని చేశాడు. 2018 తర్వాత ఈస్ట్ గోదావరి నుంచి హైదరాబాద్‌కి వచ్చి పలు కంపెనీలో హెల్పర్‌గా పనిచేశాడు దొరబాబు. అయితే నిందితులని అరెస్ట్ చేసి ఈగల్ టీం అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.మరోవైపు.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మల్కాజిగిరి ఎస్‌ఓటీ, కీసర పోలీసులు(శుక్రవారం) తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. సుమారు కోటి రూపాయలు విలువ చేసే డ్రగ్స్ పట్టుకున్నారు. ఈ సోదాల్లో 7కేజీ ఓపీఎం, 2కేజీల పప్పి స్ట్రా ఫొడర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో డ్రగ్స్ ఫెడ్లర్లను అరెస్ట్ చేశారు పోలీసులు. డ్రగ్స్ రాకెట్‌పై (శుక్రవారం) మధ్యాహ్నం మీడియాకు వివరాలు వెల్లడించనున్నారు రాచకొండ సీపీ సుధీర్ బాబు.

## లాలాగూడలో వాలీబాల్ కోచ్ వేధింపులు.. యువతి ఆత్మహత్య

హైదరాబాద్,అక్టోబరు 10 (టుడే విదుర):: వాలీబాల్ కోచ్ అంబాజీ అనే వ్యక్తి వేధింపులు తాళలేక డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకి పాల్పడింది. ఈ ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా దేవాలయం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... తార్నాక రైల్వే డిగ్రీ కళాశాలలో మౌలిక(19)అనే యువతి డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది.అదే కళాశాలలో వాలీబాల్ కోచ్‌గా చేరి, తనను ప్రేమించాలని యువతిని వేధిస్తున్నాడు అంబాజీ. ఈ నేపథ్యంలో తీవ్ర




మనస్థాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది మౌలిక. యువతి తండ్రి ప్రమోద్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మరోసారి హైడ్రా దూకుడు.. బంజారాహిల్స్‌లో కూల్చివేతలు




హైదరాబాద్, అక్టోబరు 10 (టుడే విదుర):: నగరంలో హైడ్రా మరోసారి దూకుడు పెంచింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న హైడ్రా.. తాజాగా భాగ్యనగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో కూల్చివేతలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో 5 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈరోజు (శుక్రవారం) హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సుమారు రూ. 750 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. తెల్లవారుజాము నుంచే భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టింది.దాదాపు రూ. 750 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారు. తప్పుడు పత్రాలు, సర్వే నెంబర్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై హైడ్రాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో హైడ్రా ముందుకు వచ్చి కూల్చివేతలు చేపట్టింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడింది హైడ్రా. ఈ ఐదు ఎకరాల స్థలంలో జలమండలికి 1.2 ఎకరాలను గతంలో ప్రభుత్వం కేటాయించింది. అయితే ఓ వ్యాపారి ఆ స్థలాన్ని కబ్జా చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. ఆ స్థలంలో వేసిన షెడ్లను నేలమట్టం చేసింది. ఐదు ఎకరాల చుట్టూ కూడా ఫెంక్షన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది హైడ్రా.మరోవైపు రంగారెడ్డి జిల్లాలో కూడా హైడ్రా దూకుడు పెంచింది. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో 700 గజాల ప్రభుత్వ పార్క్ స్థలాన్ని హైడ్రా కాపాడింది. కాలనీలోని పార్క్ స్థలాన్ని బీఆర్ఎస్ నేత గతంలో కబ్జాకు పాల్పడ్డారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగి.. 700 గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది.

## ఏసీబీకి చిక్కిన నల్లగొండ జిల్లా చిట్యాల తహసీల్దార్



చిట్యాల, అక్టోబరు 10 (టుడే విదుర):: భూమి మ్యుటేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసి.. ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారో తహసీల్దార్. ఈ మేరకు నల్లగొండ జిల్లా చిట్యాల తహసీల్దార్ గగులోతు కృష్ణను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ మహబూబ్‌నగర్ జిల్లా డీఎస్పీ, నల్లగొండ ఇన్‌చార్జి సీహెచ్ బాలకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని మెస్సర్స్ రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసిన భూమిని మ్యుటేషన్ చేసేందుకు తహసీల్దార్ గగులోతు కృష్ణ.. ఆ సంస్థ బాధ్యుల నుంచి రూ. 10 లక్షలు డిమాండ్ చేశారు. అయితే రూ. 5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అనంతరం ఆ తహసీల్దార్‌పై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్‌కు చెందిన వ్యక్తి రూ. 2లక్షల నగదును తహసీల్దార్ సూచించిన గట్టు రమేశ్‌కు ఇస్తుండగా అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్‌తో పాటు గట్టు రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. తహసీల్దార్ కృష్ణ, రమేశ్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్, ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణలో కొత్త పోలీసింగ్ విధానం.. డీజీపీ శివధర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 10 (టుడే విదుర):: రాష్ట్రంలో కొత్త పోలీసింగ్ విధానానికి రూపకల్పన చేస్తున్నామని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ల) వ్యాఖ్యానించారు. తెలంగాణలో న్యూ పోలీసింగ్ విధానం తీసుకువస్తామని.. ఇదీ తన లైన్ అని పేర్కొన్నారు. ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేకంగా ఇవాళ(శుక్రవారం) సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పోలీసులందరికీ దిశా నిర్దేశం చేశారు డీజీపీ శివధర్ రెడ్డి.నిష్పక్షపాత పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. నిర్భయంగా విధులు నిర్వహించడమే పోలీసుల లక్ష్యం కావాలని సూచించారు. బెదిరింపులు, ఒత్తిళ్లు, భయాలకు తలొగ్గకుండా రూల్ ఆఫ్ లా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు డీజీపీ శివధర్ రెడ్డి.పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. కేసు నమోదు నుంచి నేరస్థుడికి శిక్ష పడే దాకా పోలీసులు ప్రొఫెషనల్‌గా వ్యవహారించాలని




ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి విషయంలో కఠినంగా ఉండాలని హుకుం జారీ చేశారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది 800 హత్యలు జరిగితే.. రోడ్డు ప్రమాదాల్లో 8 వేలమంది చనిపోతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## 20 ఎకరాలు తీసుకొని బుక్కెడు బువ్వ పెడ్తలేరు!

గజ్వేల్,అక్టోబరు 10 (టుడే విదుర):: తన 20 ఎకరాల భూమిని తీసుకున్న ఇద్దరు కొడుకులు బుక్కెడు బువ్వ కూడా పెడ్తలేరంటూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూరుకు చెందిన వృద్ధురాలు కర్ల నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమితో పాటు, తాము సంపాదించిన భూమిని తన ఇద్దరు కుమారులు వారి పేరుపై పట్టా మార్పిడి చేసుకున్నారని తెలిపారు. పెద్ద కుమారుడు ఇంటికి వెళ్తే బయటకు గెంటేశాడని.. చిన్న కుమారుడు తీసుకెళ్లి నెల తర్వాత పెద్ద కుమారుడి దగ్గరికే పోవాలని పంపించేశాడని



ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన కూతురు దగ్గర రెండేళ్లున్నానని.. చివరకు సోదరులు తిట్టడంతో ఆమె సైతం బయటకు పంపించేసిందని వాపోయారు. ఈ విషయమై గతంలో ఆర్డీవోను కలిస్తే తనకు పోషణ ఖర్చులు చెల్లించాలని కొడుకులకు చెప్తే పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని మరోసారి ఆర్డీవోను కలిసి కోరినట్టు నర్సమ్మ చెప్పారు.

## భార్య డబ్బులు ఇవ్వలేదని చెరువులో దూకిన భర్త

దుబ్బాక, అక్టోబరు 10 (టుడే విదుర):: తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వడం లేదని ఓ భర్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడిని రక్షించేందుకు వెళ్లిన అతడి తండ్రి కూడా నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గురుజాల ఎల్లయ్య, చంద్రవ్వల కుమారుడు పరశురాములు తాగుడుకు బానిసయ్యాడు. గ్రామంలో ఓ మహిళ మరణించగా, గురువారం జరిగిన అంత్యక్రియల్లో డప్పు వాయించేందుకు తండ్రీకొడుకులు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన పరశురాములు భార్య



గీతను మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. అప్పటికే తాగిన మైకంలో ఉన్న భర్తకు గీత కొంతడబ్బు ఇచ్చింది. అవి సరిపోవని, మరిన్నీ డబ్బులు ఇవ్వకుంటే చనిపోతానని పరశురాములు బెదిరించాడు. అయినా ఇవ్వకపోవడంతో ఆవేశంగా అక్కడి నుంచి వెళ్లి గ్రామ శివారులోని బండ్లకుంట చెరువులో దూకాడు. కొడుకును వెతుక్కుంటూ వెళ్లిన తండ్రి ఎల్లయ్య కొడుకు చెరువులో దూకడం చూసి, అతడిని కాపాడేందుకు తానూ దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయారు. భర్త, మామల కోసం గీత, ఆమె తల్లి లక్ష్మి వెతుకుతుండగా చెరువు వద్ద పరశురాములు దుస్తులు, చెప్పులు కనిపించాయి. గ్రామస్థుల సహాయంతో చెరువులో వెతకగా, మొదట పరశురాములు, తర్వాత ఎల్లయ్య మృతదేహాలు బయటపడ్డాయి. భూంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరశురాములుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కాగా 18 ఏళ్ల క్రితం పరశురాములు తల్లి చంద్రవ్వ కూడా ఇదే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది.

# టుడే వినోదం

## రజనీకాంత్ హిమాలయాల యాత్ర.. మహావతార్ బాబాజీ గుహాలో ధ్యానం

రెండు నెలల క్రితం కూలీ వంటి హిట్ చిత్రం అందించిన సూపర్ స్టార్ రజనీకాంత్ ఇటీవల ఆధ్యాత్మిక యాత్రకు హిమాలయాలకు వెళ్లిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో రిషికేశ్ వంటి ప్రసిద్ధ ఆలయాలను సైతం దర్శించుకున్న ఆయన తాజాగా మహావతార్ బాబాజీ గుహ ను సందర్శించారు. సన్నిహితులతో కలిసి స్వయంగా కొండలు, గుట్టలు,సెలయేర్లు దాటుతూ ఆ ప్రాంతానికి చేరుకుని అక్కడ కొంతసేపు గడిపారు, ధ్యానం చేశారు.%ఆపై తిరుగు ప్రయాణంలో పలువురు అభిమానులతో ఫొటోలు దిగి వారిని ఆనంద పరిచారు. చిరునవ్వుతో వారితో కాసేపు మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 75 ఏళ్లు వచ్చినా రజినీకాంత్ లోని ఎనర్జీని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, ఇలాంటి యాత్రల ద్వారా ఆయన ఎన్నో రకాలుగా అభిమానులకు కూడా స్ఫూర్తిగా మారుతున్నారు. మీరూ ఆ ఫొటోలు, వీడియోలు చూసేయండి




మరి.%ఈ వీడియోలు చూసిన వారంతా రజనీకాంత్ గతంలో స్వయంగా నిర్మించి నటించిన బాబా సినిమాలోని రాజ్యమా, సన్యాసమా భోగమా లేక యోగమా జ్ఞానియా అజ్ఞానియా ఎవరురా ఇతడు ఎవరురా అంబరం దాటినా అతిశయం బాబా జాతకం అనే పాటను ప్లే చేస్తుండడం విశేషం.




## తెరపైకి.. విజయ్ రోల్ రాయిస్ కారు వివాదం! నాటి ఇష్యూ.. నేడు ట్రోలింగ్!



బిగ్‌బాస్ ఓపెన్ .. తిరిగొచ్చిన కంటెస్టెంట్లు! షో యథాతథం



Don't be reel hero, be real hero: HC to Vijay

Court Slaps ₹1L Fine On Actor For Contesting Entry Tax On Imported Lux Car

Sureshkumar.K
@timesgroup.com

TAXING ISSUE

Chennai: The Madras high court has imposed a fine of ₹1 lakh on actor Vijay for challenging levy of entry tax for his imported luxury car, Rolls Royce Ghost, saying such a reputed actor is "expected to pay tax promptly and punctually," and actors who are seen by their fans as real heroes "can't be just reel heroes." Dismissing the petition related to the import of the car from England in 2012, Justice S M Subramaniam said, "In a state like Tamil Nadu, where such actors have become rulers, they are not expected to behave like a 'reel hero'. Tax evasion is to be construed as an anti-national habit, attitude and mindset and unconstitutional," the judge said in his July 8 order released on Tuesday. The court directed the actor to pay the fine to the chief minister's Covid-19 public relief fund within two weeks. The current market price of the car in India is approximately ₹6 crore. Entry tax in TN is 20% of the cost of the car. Noting that non-payment of entry tax by the petitioner could never be appreciated, the judge said the actor should respect the sentiment of lakhs and lakhs of his fans who watch his movies by paying for ticket. "It is only out of such money that the petitioner has purchased the 'world's prestigious' car for his personal use," the court said. "These actors are portraying themselves as champions to bring social justice. Their movies are against corruption in society. But they are evading tax and acting in a manner which is not in consonance with the provisions of the statutes," the judge said. While the common man is motivated and encouraged to behave as a lawful citizen and pay tax and to thrive hard to achieve social justice in society, the rich, affluent and reputed people fail to pay tax, the judge said, adding that if such was the situation, it would be a long way to achieve constitutional goals.

మనం అప్పుడెప్పుడో చేసిన పనులకు ఫలితాలు మరెప్పుడో వచ్చి ఒక్కోసారి అశ్చర్య పరుస్తాయి లేదా తీవ్ర సమస్యల్లోకి నెట్టుతాయి. గతంలో అంటే సోషల్ మీడియా ప్రభావం లేదు కాబట్టి అ ఇష్యూ కొద్దిలోనే సమిసిపోయేది. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా తయ్యారైంది. చీమ చిటుక్కుమన్న అంతర్జాతీయ స్థాయిలో సమస్య వెలుగులోకి రావడం సంబంధిత వ్యక్తిని పోతే దొరకడు అనేలా ట్రోల్ చేసే పరిస్థితులు వచ్చాయి. ముఖ్యంగా రాజకీయాల్లో ఇది అంతకుమించి అనే రేంజ్‌లో ఉంటుంది. సరిగ్గా అలాంటి ఓ వ్యవహారమే ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ హల్‌చల్ చేస్తుంది.విషయానికి వస్తే.. 2012లో తమిళ స్టార్ హీరో విజయ్ ఇంగ్లాండ్ నుంచి ఖరీదైన రోల్స్ రాయిస్ కారును దిగుమతి చేసుకున్నాడు. అయితే దానికి అదనంగా భారత ప్రభుత్వానికి ఎంట్రీ ట్యాక్స్ కట్టాల్సి రావడంతో విజయ్ దానిని మినహాయించాలని కొరుతూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే.. మద్రాసు హైకోర్టు జస్టిస్ ఎస్.ఎం. సుబ్రమణ్యం అతని పిటిషన్‌ను కొట్టివేయడమే కాక ఓ సెలబ్రిటీ అయి ఉండి, హీరోగా సినిమాల్లో ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చే మీరు ట్యాక్స్ లో మినహాయింపు అడుగుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం టాక్స్‌తో పాటు జరిమానాగా తమిళనాడు ముఖ్యమంత్రి ప్రజా సహాయ నిధికి రూ.1 లక్ష చెల్లించాలని కూడా ఆదేశించారు.అయితే.. నాడు న్యాయమూర్తి వ్యాఖ్యలతో కలత చెందిన విజయ్ ఆ వ్యాఖ్యలను తొలగించాలని, జరిమానాను కూడా రద్దు చేయాలని 2021 అక్టోబర్‌లో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ సందర్భంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ విజయ్ తరపు న్యాయవాది విజయ్ నారాయణ్ మాట్లాడుతూ.. నటుడు విజయ్ పన్ను చెల్లింపును ఎగవేసేందుకు ప్రయత్నించలేదని, పన్ను విధించడాన్ని సవాలు చేయడానికి తన రాజ్యాంగ హక్కును ఉపయోగించుకున్నారని పిటీషన్ సమర్పించారు. ననాడు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యల వల్ల విజయ్‌ను అంతా జాతి వ్యేతిరేకుడిగా చిత్రీకరించి చూపించారని అన్నారు.

## మోహన్‌లాల్ పాంచ్ పటాకా.. ఈ ఏడాదిలో ఐదో సినిమా రిలీజ్




%మలయాళ సినీ పరిశ్రమలో లెజెండరీ స్టార్ మోహన్‌లాల్ మరోసారి తన సత్తా చాటుకున్నాడు. 2025 సంవత్సరం ఆయన కేరీర్‌లోనే గోల్డెన్ ఇయర్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వయసు మీద పడుతున్నా ఒకదాని తర్వాత మరోటి సినిమాలు చేస్తూ వాటిని రిలీజ్ చేసి అంతకుమించి విజయాలు సాధిస్తూ కుర్ర హీరోలకు సింహాస్వప్నంలా మారాడు. ఈ ఒక్క సంవత్సరమే కేరళ బాక్సాఫీస్ వద్ద ?250 కోట్ల కలెక్షన్లు సాధించి మలయాళ నటులందరికీ ఒక కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేశారు.అదేవిధంగా ఏడాది ఆరంభంలో వచ్చిన %ూ%2–ఎంపురాన్ (86.25 కోట్లు), తుడరం (118.90 కోట్లు), చొట్ట ముంబై (రీ–రిలీజ్) ( ?3.61 కోట్లు), తాజాగా హృదయపూర్వం (41.32 కోట్లు) సినిమాల విజయాలతో మోహన్‌లాల్ కేరళలో మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా కలెక్షన్ల వర్షం కురిపించాయి. గ్లోబల్ బాక్సాఫీస్‌లో మొత్తం ?550 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి, మలయాళ సినిమాకు కొత్త శిఖరాలను చూపించి చరిత్ర సృష్టించారు. మలయాళ సినిమాలను కొత్త పుంతలు తొక్కించారు. అదేవిధంగా తెలుగు చిత్రం కన్నప్పలోనూ ఓ ప్రధాన పాత్రలోనూ నటించి మెప్పించాడు.%ఇదిలాఉండగా.. ఇదే కోవలో ఆయన మలయాళంలో నటించిన మరో సినిమా 'వృషభ' కూడా మరో నెలలో విడుదలకు సిద్ధమైంది. ముందుగా దీపావళి కానుకగా థియేటర్లలోకి ఈ సినిమాను తీసుకురావాలని భావించిన కొన్ని కారణాల వల్ల సినిమాను రెండు వారాలు పోస్ట్‌పోన్ చేసి నవంబర్ 6, 2025న ప్రపంచవ్యాప్తంగా మలయాళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదలకు ముహూర్తం ఫిక్స్ చేశారు.

## తెలుగు క్రైమ్, ఇన్వేస్టిగేషన్ థ్రిల్లర్ రెండు ఓటీటీల్లోకి వచ్చేసింది

మహాభారత పురాణ పాత్ర బార్బరికుడి మూడు అద్భుత బాణాల కథను ఆధారంగా చేసుకుని, దర్శకుడు మోహన్ శ్రీవత్స తెరకెక్కించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ త్రిబాణధారి బార్బరిక్ అగస్టు 8, 2025న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన తెచ్చుకున్నప్పటికీ థియేటర్లలో వచ్చి చూడడానికి చాలామంది ఆసక్తి చూపలేదు. దీంతో ఈ చిత్ర దర్శకుడు తన చెప్పుతో తనను తానే కొట్టుకున్న విషయం బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది.ఘటోత్కచుని కుమారుడైన బార్బరికుడికి దేవతలు మూడు బాణాలు ప్రసాదిస్తారు. అవి ఒక్కొక్కటి విశేష శక్తి కలిగినవి. ఒక్క బాణంతో శత్రువులను గుర్తించడం, మరో దానితో వారిని బంధించడం, మూడవది వారిని నాశనం చేస్తుంది. సరిగ్గా ఈ కాన్సెప్టును మాత్రమే దర్శకుడు తీసుకుని ఓ కిడ్నాప్ అయిన మనుమరాలిని వెతికే క్రమంలో ఓ తాత చేసిన ఇన్వెస్టేగేషన్ చూట్టూ ఈ చిత్రం సాగుతుంది. మరో వైపు డబ్బు కోసం ఇద్దరు చేసిన పనులు




వాళ్ల ప్రాణం మీదకు ఎలా వచ్చింది, వారికి ఆ కిడ్నప్ అయున అమ్మాయికి మధ్యలింక్ ఏంటి అనేదే స్టోరి.కథ మొదటి అర్ధంలో ఫాస్ట్–పేస్డ్ ఇన్వెస్టిగేషన్‌తో సాగుతూ ఆకట్టుకుంటుంది. రెండో భాగంలో ఎమోషనల్ టర్న్ తీసుకుంటుంది.అంతేగాక సినిమా కొంచెం నెమ్మదిస్తూ, అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అయితే చివర్లో వచ్చే క్లైమాక్స్ ట్విస్ట్, బార్బరికుడి లింక్‌ను ఎమోషనల్‌గా చూపించడం ఆసక్తికరంగా ఉంటుంది. మన చుట్టూ రాముడి వేషంలో రావణులు దాగి ఉంటారు అనే సందేశం కూడా ఇస్తుంది. థ్రిల్లర్, సస్పెన్స్ కథల్ని ఇష్టపడేవారు ఒకమారు చూడొచ్చు. ఇప్పుడీ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో, సన్ నెక్స్ట్ ఓటీటీల్లో తెలుగుతో పాటు తమిళంలో స్ట్రీమింగ్ అవుతుంది.

## బిగ్‌బాస్ ఓపెన్ .. తిరిగొచ్చిన కంటెస్టెంట్లు! షో యథాతథం




అనుమతులు లేకుండా బిగ్‌బాస్ నడిపిస్తున్నారంటూ కన్నడనాట అధికారులు ఆ షో నిర్వహిస్తున్న ప్రాంతానికి వెళ్లి కంటెస్టెంట్లను బయటకుతీసుఉవచ్చి తాళం వేసిన సంగతి జాతీయ వ్యాప్తంగా చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ సమస్య ఓ కోలిక్కి రావడంతో కన్నడ బిగ్‌బాస్ 12వ ) సీజన్ యథాతథంగా కొనసాగుతుంది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బిగ్ బాస్ హోస్ట్ కిచ్చా సుదీప్ బుధ వారం రాత్రి చర్చలు జరపడంతో సమస్య పరిష్కారమైంది.డీసీఎం ఆదేశాలతో రామనగర్ జిల్లా అధికారి యశ్వంత్ గురుకర్, ఎస్పీ శ్రీనివాస గౌడ, తహసీల్దారు తేజశ్విని తదితరులు జాలీవుడ్ స్టుడియోకు వేసిన తాళాలను గురవారం తెల్ల వారుజామున 2.45 గంటలకు తెరిచారు. ఆ వెంటనే ఈగల్టన్ రిసార్టులో ఉన్న 17మంది కంటెస్టెంట్లను నిర్వాహకులు బిగ్బాస్ హౌస్‌కు తీసుకువచ్చారు.

## బ్యాగ్రౌండ్ ఉన్నా.. కష్టం మామూలే..

సినిమా ఇండస్ట్రీలో బంధుప్రీతి, నేపథ్యంఅనే టాపిక్, బ్యాగ్రౌండ్‌తో వచ్చిన ఆర్టిస్టులు ఈజీగా సక్సెస్ అవుతారని తరచూ వినిపిస్తోంది. ఇది బాలీవుడ్‌లో మరింత ఎక్కువ. తాజాగా ఓ కార్యక్రమంలో ఈ విషయంపై బాలీవుడ్ నటుడు రణ్‌బీర్‌కపూర్ స్పందించారు. 'నేను కపూర్ ఫ్యామిలీలో పుట్టినా, నాకు అది ఒక సాధారణ కుటుంబలాగే అనిపిస్తుంది. ఇంట్లో సినిమాకు సంబంధించి కుటుంబ సభ్యులు మధ్య చాలా చర్చలు జరిగేవి. ఒక సన్నివేశం, ఒక పాట ఇలా చాలా విషయాలను చర్చించేవారు.'ఫిల్మ్ మేకింగ్ ఒక పెళ్లిలాంటిది. నటీనటులందరూ కలిసి పాల్గొనేది. అది ఒక నమ్మకం, ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించడం' అని ముత్తాత పృథ్వీరాజ్ కపూర్ చెప్పేవారని మా ఇంట్లో వాళ్లు చెబుతుంటారు. సినిమా ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ ఉన్న కుటుంబం నుంచి వచ్చినా ప్రత్యేక, వ్యక్తిగత గుర్తింపు తెచ్చుకోకపోతే సినిమా ఇండస్ట్రీలో విజయం సాధించడం అంత ఈజీ కాదు. నేను సినీ వారసత్వానికి చెందిన వాడిని కావడంతో. అవకాశాలను ఈజీ అందుకోగలిగాను. అలాగని నేను పని చేయకుండా సక్సెస్ రాలేదు. నేనెప్పుడూ కష్టపడుతూనే ఉన్నాను. నా కుటుంబం సాధించిన ఎన్నో



విజయాలను మీరు కూడా ఆనందంగా జరుపుకొని ఉంటారు. కానీ, అదే సమయంలో అపజయాలను చూశాం. సక్సెస్ మనకు ఎంత నేర్పిస్తుందో ఫెయిల్యూర్ కూడా అంతే నేర్పిస్తుంది.




# క్రీడావార్తలు




## భారత్‌కు ఝలక్ మలుపుతిప్పిన డి క్లెర్క్

ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో నాడిన్ డి క్లెర్క్ (54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 84 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా మూడు వికెట్ల తేడాతో భారత్‌కు షాకిచ్చింది. తొలుత భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (77 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 94), ప్రతీక రావల్ (37), స్నేహ్ రాణా (33) పోరాటాలు వృథా అయ్యాయి. ట్రయన్ 3 వికెట్లు.. కాప్, డి క్లెర్క్, ఎంలబా తలో రెండు వికెట్లు సాధించారు. ఛేదనలో సౌతాఫ్రికా 48.5 ఓవర్లలో 252/7 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ లారా వొల్వార్డ్ (70), ట్రయన్ (49) రాణించారు. డి క్లెర్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.నిలబడిన లారా..: బ్రిట్స్ (0)ను మూడో ఓవర్‌లోనే క్రాంతి రిటర్న్ క్యాచ్‌తో డకౌట్ చేయడంతో.. ఆరంభంలోనే సౌతాఫ్రికా ఆట గతితప్పింది. లూస్ (5)ను అమన్‌జోత్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపింది. కాప్(20)ను రాణా బౌల్డ్ చేయగా.. బోష్ (1)ను దీప్తి రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపింది. జెఫ్టా (14)ను శ్రీచరణి వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో సఫారీలు 81/5తో ఇబ్బందుల్లో పడ్డారు. అయితే, ట్రయన్‌తో కలిసి లారా ఆదుకొనే ప్రయత్నం చేసింది. కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చిన భారత ఫీల్డర్లు ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం కల్పించారు. చివరి 4 ఓవర్లలో సౌతాఫ్రికా విజయానికి 41 రన్స్ కావాల్సి ఉండగా.. క్రాంతి వేసిన 47వ ఓవర్‌లో డి క్లెర్క్ 6,6,4తో 18 రన్స్ రాబట్టింది. దీంతో సమీకరణం 18 బంతుల్లో 23 రన్స్‌కు దిగివచ్చింది.




ఈ దశలో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాదిన డి క్లెర్క్.. మరో ఏడు బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేసింది.మంధాన విఫలం..: మరోసారి టాపార్డర్ వైఫల్యంతో కష్టాల్లో పడిన భారత్.. రిచా ఎదురుదాడితో పోరాడగలిగే స్కోరు చేసింది. ఒక దశలో భారత్ 153/7తో కష్టాల్లో పడగా.. రిచా, రాణా ఎనిమిదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 250 దాటించారు. స్మృతి మంధాన (23) మళ్లీ విఫలమైంది. హర్లీన్ డియోల్ (13), ప్రతీక, జెమీమా (0), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9), దీప్తి శర్మ (4) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. భారత్ 47 పరుగుల తేడాతో ఐదు వికెట్లు చేజార్చుకొంది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రిచా ఎటాకింగ్ ఆటతో మ్యాచ్ గతిని మార్చింది. అయితే, ఆఖరి ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో క్యాచవుటైన రిచా త్రుటిలో శతకం చేజార్చుకొంది.ఈ మ్యాచ్‌లో 23 పరుగులు చేసిన మంధాన.. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక రన్స్ (982) సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో 1997లో ఆస్ట్రేలియా క్రికెటర్ బెలిండా క్లార్క్ 970 పరుగుల రికార్డును స్మృతి అధిగమించింది. 8వ నెంబరులో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రిచా (94) సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఏడాది శ్రీలంకతో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ప్లేయర్ ట్రయన్ 74 పరుగుల రికార్డును ఘోష్ బద్దలుకొట్టింది.

## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. తొలి బౌలర్‌గా రికార్డు



ఆఫ్ఘానిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. ఈ బౌలర్ ఆసియా క్రికెట్ చరిత్రలో సూపర్ రికార్డు సాధించాడు. ఇప్పటివరకు ఏ బౌలర్‌కు సాధ్యం కాని ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలి ఆసియా బౌలర్‌గా రషీద్ ఖాన్ నిలిచాడు. ఇంతకీ ఆయన సాధించిన రికార్డు ఏమిటి అనే కదా మీ సందేహం. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...తాజాగా బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్తాన్ వన్డే సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా మూడు వన్డేలు జరగనున్నాయి. ఈ క్రమంలో బుధవారం జరిగిన తొలి వన్డేలో అఫ్గాన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్( 3 వికెట్లు తీశాడు. దీంతో వన్డే ఫార్మాట్‌లో 200ం వికెట్లు తీసిన తొలి అఫ్గాన్ బౌలర్‌గా నిలిచాడు. కేవలం 115 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించాడు. అతడి తర్వాత మహ్మద్ నబీ (174 మ్యాచుల్లో 176 వికెట్లు) ఉన్నాడు. ఆసియా క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకూ ఎవరూ సాధించనిన రికార్డును రషీద్ తన ఖాతాలో వేసుకున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అంటే వన్డేలు, టీ20లు. ఈ ఫార్మాట్లలో 200ం వికెట్లు, 150ం వికెట్లు తీసిన ఏకైక బౌలర్ రషీద్ ఖాన్. ఇటు ఐపీఎల్‌లోనూ 150ం వికెట్లు పడగొట్టడం గమనార్హం. అంతర్జాతీయ టీ20ల్లో 179 వికెట్లు, ఐపీఎల్‌లో 158 వికెట్లు తీశాడు. ఐపీఎల్ ద్వారా ఈ అఫ్గాన్ బౌలర్ ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ కి సుపరిచితుడు.ఇక బంగ్లాదేశ్(, ఆఫ్గానిస్తాన్ మధ్య తొలి వన్డే విషయానికి వస్తే.. అబుదాబీ వేదికగా ఈ రెండు జట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 48.5 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ (60), తౌహిద్(56) హాఫ్ సెంచరీలు చేశారు. రషీద్ 3, అజ్మతుల్లా 3, ఘజన్‌ఫర్ 2, ఖరోటె 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఆఫ్గానిస్తాన్ 47.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయిన 226 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు రహ్మతుల్లా గుర్బాజ్ (50), రహ్మత్ షా (50) అర్ధ శతకాలతో పాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (40), షాహిది (33లి) విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో అఫ్గాన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

## క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..బరిలోకి టీమిండియా జూ నేటి నుంచి విండీసతో రెండో టెస్టు



న్యూఢిల్లీ: వెస్టిండీసతో జరిగిన తొలి టెస్టును పూర్తి ఏకపక్షంగా మార్చేసి మూడు రోజుల్లోపే ముగించిన టీమిండియా.. ఇప్పుడు క్లీన్‌స్వీపపై కన్నేసింది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య ఆఖరిదైన రెండో టెస్టు జరుగనుంది. గతమెంతో ఘనమైన కరీబియన్ టీమ్ భారత జట్టుతో ఏ విభాగంలోనూ సరితూగే స్థాయిలో లేదు. దీంతో ఈ టెస్టులోనూ గిల్ సేనకు పెద్దగా పోటీ ఉండకపోవచ్చు. అయితే తమ జట్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న దిగ్గజ ఆటగాళ్లు లారా, రిచర్డ్స్, రిచర్డ్‌సన్ మ్యాచ్‌కు ముందు విండీస్ ఆటగాళ్లతో సంభాషించి వారిలో ఉత్తేజాన్ని నింపనున్నారు. తొలి టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో కలిపినా విండీస్ బ్యాటర్లు కనీసం 90 ఓవర్లు ఆడలేకపోయారు. అలాగే ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ సాధించలేదు. 2002లో భారత్‌పై చివరి విజయం సాధించిన విండీస్ తాజా టెస్టులో ఏమేరకు పోటీనిస్తుందో వేచి చూడాల్సిందే. ఇక అరుణ్ జైట్లీ మైదానంలో భారత్ 1987లో చివరిసారిగా టెస్టు మ్యాచ్‌లో ఓడింది.మార్పుల్లేకుండానే..: అన్ని విభాగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న టీమిండియా తమ తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. అయితే సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ బ్యాటింగ్‌పై ఎక్కువగా దృష్టి సారించే అవకాశం ఉంది. తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసిన నితీశ్‌కు బ్యాటింగ్ చేసే చాన్స్ రాలేదు. అందుకే ఈ టెస్టులో అతడిని ముందుగా పంపే అవకాశం ఉంది. ఇక తొలి టెస్టులో టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ అద్భుతంగా ఆడినా వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ మాత్రం ఏడు పరుగులకే పరిమితమయ్యాడు. రాహుల్, జురెల్, జడేజా శతకాలతో ఫామ్‌ను చాటుకోగా.. గిల్, జైస్వాల్ కూడా రాణించారు. బౌలింగ్‌లో పేసర్లు బుమ్రా, సిరాజ్ అదుర్స్ అనిపించుకున్నారు. కుల్దీప్, సుందర్ స్పిన్‌లో ప్రభావం చూపుతున్నారు.

## ఇంటర్నేషనల్ టీ-20 టీమ్ ను ప్రకటించిన సికందర్ రాజా.. కెప్టెన్ ఎవరంటే..

ఇటీవలే టీమిండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి బీసీసీఐ తొలగించిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్ ను టీమిండియా కొత్త సారథిగా ఎంపిక చేశారు. అయితే ఈ నిర్ణయంపై క్రికెట్ ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలానే రోహిత్ ఫ్యాన్స్ అయితే సెలక్షన్ కమిటీపై ఫైర్ అవుతున్నారు. ఈ క్రమంలో హిట్ మ్యాన్ అభిమానులకు సంతోషాన్ని ఇచ్చే న్యూస్ ఒకటి వచ్చింది. రోహిత్ శర్మను కెప్టెన్ గా ప్రకటించారు. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...జింబాబ్వే ఆల్‌రౌండర్ సికందర్ రాజాఆల్‌టైమ్ అత్యుత్తమ టీ20 జట్టును ప్రకటించాడు. ఇంటర్నేషనల్ టీ20ల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లతో ఈ జట్టును ఎంపిక చేశాడు. ఈ ఆల్‌టైమ్ టీ20 %శ××%కు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను సారథిగా ఎంపిక చేశాడు. భారత్ నుంచి రోహిత్ శర్మతో పాటు జడేజా, బుమ్రాకు ఈ జట్టులో చోటు దక్కింది. అలానే దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరూ, వెస్టిండీస్ నుంచి ముగ్గురు, ఆసీస్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల నుంచి ఒక్కో ప్లేయర్ ఎంపికయ్యాడు. ఇక్కడ షాకింగ్ విషయం ఏమిటంటే.. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీలకు ఈ జట్టులో స్థానం దక్కలేదు.



ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ కోహ్లీకి తిరుగులేదు. నిలకడకు మారుపేరైనా కోహ్లీ పేరు ఆల్‌టైమ్ టీ20 ఎలెవన్‌లో లేకపోవడాన్ని అతని అభిమానులు తప్పుబడుతున్నారు..ఆల్‌టైమ్ టీ20 ఎలెవన్ జట్టు ఓపెనర్లుగా క్రిస్ గేల్, రోహిత్ శర్మను సికిందర్ రాజా ఎంపిక చేశాడు. అలానే వికెట్ కీపర్‌గా నికోలస్ పూరన్‌ను, ఏబీ డివిలియర్స్, హెన్రీచ్ క్లాసెన్, కీరన్ పొలార్డ్ ఫినిషర్లుగా ఎంచుకున్నాడు. ఆల్‌రౌండర్‌గా జడేజాను, స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రషీద్ ఖాన్‌ను సికిందర్ తీసుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మిచెల్ స్టార్క్, షాహిద్ అఫ్రిదిలను పేసర్లుగా ఎంచుకున్నాడు.సికందర్ రాజా ఆల్‌టైమ్ %ట%20 ఎలెవన్:రోహిత్ శర్మ(కెప్టెన్), క్రిస్ గేల్, నికోలస్ పూరన్, ఏబీ డివిలియర్స్, హెన్రీచ్ క్లాసెన్, కీరన్ పొలార్డ్, రవీంద్ర జడేజా, రషీద్ ఖాన్, షాహీన్ షా అఫ్రిది, జస్‌ప్రీత్ బుమ్రా, మిచెల్ స్టార్క్.

## జట్టు నుంచి తప్పించిన సెలెక్టర్లు.. కౌంటర్ ఇచ్చిపడేసిన ప్లేయర్

ఫామ్‌లో లేరని ప్లేయర్లను సెలెక్టర్లు జట్టు నుంచి తప్పించడం క్రికెట్ లో చాలా సర్వసాధారణ విషయం. అంతేకాక జట్టులో స్థానం కోల్పోయిన వారు చాలా కాలం తరువాత గానీ తిరిగి టీమ్ లో స్థానం సంపాదించలేరు. ఇది ఇలా ఉంటే కొందరు సెలెక్టర్లు కూడా తప్పుడు నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. జట్టు ఎంపిక విషయంలో మిస్టేక్స్ జరిగే సందర్భాలు అనేకం ఉంటాయి. ఈ క్రమంలో జట్టులో స్థానం కోల్పోయిన ప్లేయర్లు వివిధ రూపాల్లో సెలెక్టర్లకు గట్టి కౌంటర్ ఇస్తుంటారు. తాజాగా ఆస్ట్రేలియా సీనియర్ ప్లేయర్ మార్నస్ లాబుషేన్ ఆసీస్ జట్టు సెలెక్టర్లకు దిమ్మతిరిగే రిప్లయ్ ఇచ్చాడు. మరి..ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..అక్టోబర్ 19న టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత్ జట్టు వచ్చే వారం ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. ఇదే సమయంలో భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు ఆసీస్ బ్యాట్స్‌మన్‌మార్నస్ లాబుషేన్ దూరంగా ఉన్నాడు. అతడు ఫామ్ లో లేడనే కారణంతో భారత్ తో జరిగే సిరీస్ కు మార్నస్ ను సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. తాజాగా దేశవాళీ క్రికెట్‌లో వరుసగా తాను మూడో సెంచరీ సాధించడం ద్వారా తాను ఫామ్ లో ఉన్నానని సెలెక్టర్లకు పరోక్షంగా ఇచ్చి పడేశాడు. ఇది త్వరలో ఇంగ్లాండ్ లో జరిగే యాషెస్




సిరీస్ కోసం వెళ్లే జట్టులో స్థానం పొందే అవకాశాలను ఖచ్చితంగా బలోపేతం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు.స్వదేశంలో భారత్ తో జరిగే వన్డే సిరీస్ నుంచి తప్పుకున్న తర్వాత మార్నస్ లాబుషేన్‌దేశీయ క్రికెట్‌లో సంచలనం సృష్టించాడు. క్వీన్స్‌ల్యాండ్ తరఫున ఆడుతున్న లాబుషేన్ 91 బంతుల్లో 105 పరుగులు చేశాడు. వాటిలో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. అతడు చేసిన ఈ స్కోర్ క్వీన్స్ లాండ్.. టాస్మానియాపై 50 ఓవర్లలో 311 పరుగులు చేయడానికి సహాయపడింది. తన చివరి నాలుగు ఇన్నింగ్స్‌లలో ఇది మూడవ సెంచరీ.

## ఆ అనుభవం మాకు కావాలి.. రోహిత్ పై గిల్ కామెంట్స్

టీమిండియా స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపై యంగ్ ప్లేయర్, వన్డే కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ శర్మ ఫ్రెండ్లీ వాతావరణం సృష్టించాడని.. తానూ అదే కొనసాగిస్తానని ఎంపికైన శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యానించాడు. శుక్రవారం వెస్టిండీస్‌తో రెండో టెస్టు నేపథ్యంలో గిల్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు.గిల్ మాట్లాడుతూ..'రోహిత్ శర్మ చాలా ప్రశాంతంగా ఉంటాడు. అతడు కెప్టెన్ గా ఉంటూ జట్టులో నెలకొల్పిన స్నేహపూరిత వాతావరణాన్ని కెప్టెన్ గా నేనూ కొనసాగిస్తాను. చాలామంది బయట నుంచి అనేక రకాల కామెంట్స్ చేస్తున్నారు. అయితే రోహిత్, విరాట్ ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్నారు. వారిద్దరి భవితవ్యంపై ఊహాగానాలు వస్తున్నాయి. వీరిద్దరూ అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు. వీరు అనేక మ్యాచుల్లో భారత్ ను గెలిపించారు. జట్టుకు వారు చాలా అవసరం. వచ్చే వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా వారి సన్నద్ధత జరుగుతోంది" అని గిల్ వెల్లడించారు.ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని గిల్ తెలిపాడు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేమని, తాను కూడా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నానని వ్యాఖ్యానించాడు. అయితే, తానెప్పుడూ వర్తమానంలో ఉండేందుకే ఇష్టపడతానని, అలాగే గతంలో ఏం సాధించాననేది అప్రస్తుతమని అన్నాడు. ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతోనే ముందుకుసాగుతామని, రాబోయే కొన్ని నెలలు మాకు చాలా ముఖ్యమని గిల్ తెలిపాడు.

# బిజినెస్



## రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఉత్పత్తికి రూ.7,300 కోట్ల ప్రోత్సాహం



ఇంటర్నెట్ డెస్క్: అరుదైన భూ అయస్కాంతాల ఉత్పత్తికి భారత సర్కారు చేయూత నివ్వబోతోంది. ఈ రంగం భారత దేశంలో ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని రంగంగానే ఉండటంతో ఈ మేరకు మోదీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. దేశీయ స్థాయిలో ఈ రంగంలో ప్రధానంగా ప్రభుత్వ రంగ కంపెనీలు, కొన్ని ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.అయితే, ప్రస్తుతం భారత్ ఎక్కువగా రేర్ ఎర్త్ మెటీరియల్స్, మ్యాగ్నెట్‌ల కోసం చైనా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ తాజాగా ప్రకటించిన రూ. 7,300 కోట్ల ప్రోత్సాహక పథకం ప్రకటనతో ఈ రంగంలోని భారతీయ కంపెనీలు మరింతగా ముందుకెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.ఇప్పటి వరకు ఈ రంగంలో కీలకంగా ఉన్న కంపెనీల విషయానికి వస్తే, ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ ఉంది. ఇది ప్రభుత్వ రంగ సంస్థ (కాగా, భారత అణుశక్తి శాఖ క్రింద పనిచేస్తుంది. రేర్ ఎర్త్ మెటీరియల్స్ (నీఓడిమియం, ప్రాసియోడిమియం మొదలైనవి) ఉత్పత్తి చేస్తుంది.ఈ రంగంలోని మరో కంపెనీ ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ లిమిటెడ్ (ఈఎస్ఎల్). ఈ కంపెనీ రేర్ ఎర్త్ మ్యాగ్నెట్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇది ఇప్పటికీ పరిశోధన, అభివృద్ధి (%=ఉఐ%) దశలో ఉంది. ప్రభుత్వ పథకాల ద్వారా మరింత పెట్టుబడులు దక్కించుకునే అవకాశం ఉంది.ప్రైవేటు స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కొన్ని చిన్న-మధ్య తరహా సంస్థలు (%మీావీజుం%)స్టార్టప్‌లు, బెంగళూరు, పూణేల్లో, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్‌ల కోసం ప్రాథమిక పరిశోధనలు చేస్తున్నాయి. అయినా, వీటి ఉత్పత్తి స్థాయి పరిమితం. వీటికి ప్రభుత్వ మద్దతు అవసరం ఉంది.ప్రస్తుతం భారత్‌లో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో లేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం రూ. 7,300 కోట్ల ప్రోత్సాహక పథకం ప్రకటనతో భారతీయ కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. %×=జుూ%తో పాటు, భవిష్యత్తులో టాటా, రిలయన్స్, మహీంద్రా వంటి పెద్ద సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.

## దేశంలోని 100మంది కుబేరుల్లో అంబానీదే అగ్రస్థానం




**గౌతమ్ అదానీ నం.2**

**సావిత్రి జిందాల్‌కు 3 వ స్థానం**

**ఫోర్బ్స్ జాబితా విడుదల**

**లిస్ట్‌లో ఆరుగురు తెలుగువారు**

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత ధనవంతులైన 100 మంది వివరాలతో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 105 బిలియన్ (10,500 కోట్ల) డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో రూ.9.32 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ముకేశ్ అంబానీ ఆస్తి 12 శాతం తగ్గిందని ఫోర్బ్స్ తెలిపింది. కాగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 92 బిలియన్ డాలర్ల (9,200 కోట్ల డాలర్లు=రూ.8.17 లక్షల కోట్లు) సంపదతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ఓపీ జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్ కుటుంబం 40.2 బిలియన్ డాలర్ల (4,020 కోట్ల డాలర్లు=రూ.3.57 లక్షల కోట్లు) నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉంది. దేశంలోని టాప్ టెన్ ధనవంతుల్లోని ఏకైక మహిళ ఆమే. భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్, హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్‌నాడార్ 4,5 స్థానాల్లో నిలిచారు. తెలుగువారి విషయానికొస్తే, ఈ జాబితాలో ఆరుగురికి చోటు లభించింది. తెలుగు సంపన్నుల్లో దివీస్ ల్యాబ్స్ అధిపతి మురళి దివి అగ్రస్థానంలో ఉన్నారు.

## టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ ప్రస్తుత ఆర్థి క సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.12,075 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.11,909 కోట్లతో పోల్చితే లాభం 1.4% పెరిగింది. బీఎఫ్ఎసఐ సహా విభిన్న విభాగాల్లో ఏర్పడిన వృద్ధి లాభం పెరగడానికి దోహదపడిందని టీసీఎస్ వెల్లడించింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 2.39% వృద్ధితో రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు పెరిగింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 3.7% పెరిగినా లాభం 5.3% క్షీణించింది. మొత్తం కాంట్రాక్టు విలువ లేదా టీసీవీ (కాంట్రాక్టు కాలపరిమితిలో సంబంధిత కస్టమర్ నుంచి ఆశిస్తున్న ఆదాయం) రెండో త్రైమాసికంలో వెయ్యి కోట్ల డాలర్లున్నట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ సెస్కారియా అన్నారు. ఈ త్రైమాసికంలో అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధిని తాము నమోదు చేసినట్టు సమీర్ చెప్పారు.మధ్యంతర డివిడెండ్: ఒక రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై 11 రూపాయల రెండవ మధ్యంతర డివిడెండును టీసీఎస్ ప్రకటించింది. నవంబరు 4వ తేదీన ఈ డివిడెండును చెల్లిస్తారు. డివిడెండు పొందేందుకు అక్టోబరు 15 రికార్డు తేదీగా నిర్ణయించారు. బీఎసఈలో గురువారం టీసీఎస్ షేరు 1.16% లాభంతో రూ.3,061.95 వద్ద ముగిసింది.

డేటా సెంటర్ల కోసం ప్రత్యేక అనుబంధ సంస్థ

ఇన్‌ఫ్రా, టెక్నాలజీ ఆధారిత సేవలందించగల ఏఐ, స్వతంత్ర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ ఒకటి ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ కోసం ఒక ప్రత్యేక వ్యాపార విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. అలాగే మార్కెటింగ్ క్లౌడ్, సీఆర్ఎం, డేటా క్లౌడ్, ఏజెంట్ ఫోర్స్, ఏఐ అడ్వైజరీ సర్వీసుల్లో స్పెషలైజేషన్ గల అమెరికాకు చెందిన లిస్ట్‌ఎంగేజ్ కంపెనీని 7.28 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసినట్టు తెలియ చేసింది.


3 నెలల్లో 20,000 మంది ఔట్

మారుతున్న వ్యాపార ముఖచిత్రానికి దీటుగా కంపెనీ పునర్నిర్మాణం పేరిట టీసీఎస్ ఒక్క త్రైమాసికంలోనే (జూలై-సెప్టెంబరు) సుమారు 20 వేల మందికి ఉద్వాసన చెప్పినట్టు కంపెనీ వెబ్‌సైట్‌లోని గణాంకాలు తెలుపుతున్నాయి. జూన్ త్రైమాసికం చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 6,13,069 ఉండగా సెప్టెంబరు చివరి నాటికి 5,93,314 ఉన్నట్లు అందులో ఉంది. అంటే నికరంగా తొలగించిన ఉద్యోగులు 19,755 అయితే .కంపెనీ మా త్రం ఆ సంఖ్యను తగ్గించి చూపుతోందని ఐటీ ఉద్యోగుల యూనియన్ నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ సెనేట్ (నైట్స్) ఆరోపించింది. అయితే గురువారం ఆర్థిక ఫలితాల సందర్భంగా కంపెనీ సీహెచ్ఆర్ఓ సుదీప్ కున్నుమల్ మాత్రం తాము తొలగించింది 6,000 మంది మాత్రమేనని చెప్పారు. అయితే బీఎసఈకి పంపిన సమాచారంలో మాత్రం కంపెనీ ప్రకటించిన సంఖ్యలో త్రైమాసికం చివరి నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్యను, ఉద్యోగుల వలసల సంఖ్యను మినహాయించారని నైట్స్ ఆరోపిస్తోంది. అయితే కంపెనీ వెబ్‌సైట్‌లో మాత్రం పైన పేర్కొన్న గణాంకాలున్నాయని తెలిపింది. టీసీఎస్ వంటి సంస్థ చూపిన గణాంకాల్లోని ఈ వ్యత్యాసం ఏదో పొరపాటు చర్యగా భావించలేమని... రెగ్యులేటర్లు, విధానకర్తలు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ఉద్దేశపూర్వక చర్య అని నైట్స్ వాదిస్తోంది.




## ఒడిదుడుకుల్లో సూచీలు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

బుధవారం నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఫైనాన్షియల్ రంగంలో అమ్మకాలు సూచీలకు నెగిటివ్‌గా మారాయి. దీంతో సూచీలు లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. ఒక దశలో 82 వేల మార్క్ దాటిన సెన్సెక్స్ మళ్లీ కిందకు దిగి వచ్చింది. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. బుధవారం ముగింపు (81, 773)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 130 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో వంద పాయింట్లు ఆర్జించి 82 వేల మార్క్‌ను దాటింది. అయితే కాసేపటికే ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 55 పాయింట్ల లాభంతో 81, 829 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 37 పాయింట్ల




లాభంతో 25, 083 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, అరబిందో ఫార్మా, లూపిన్, ప్రెస్టేజ్ ఎస్టేట్, టాటా స్టీల్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి ఇన్ఫోఎడ్జ్, యూనో మిండా, పీబీ ఫిన్‌టెక్, రైల్ వికాస్, అశోక్ లేలాండ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 327 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 35 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.78గా ఉంది.

## పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. తగ్గిన బంగారం ధర.. ఎంతంటే?

శుక్రవారం (అక్టోబర్ 10న) హైదరాబాద్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,22,290 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,13,800 పలికింది. అలానే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,720 గా ఉంది. ఒక కేజీ వెండి ధర రూ. 1,80,000 పలికింది. బంగారం ధర నేడు భారీగా పెరిగింది. అలానే ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1, 22,440కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 12, 200 పలికింది. బంగారం ధరలు నిన్నటి తో పోల్చుకుంటే వెయ్యి రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## రైతులకు గుడ్ న్యూస్.. నెలకు రూ.5000 పెన్షన్..




న్యూఢిల్లీ, అక్టోబర్ 09: అసంఘటిత రంగంలోకి కార్మికులకు పెన్షన్ అందించేందుకు అటల్ పెన్షన్ యోజన పథకాన్ని కేంద్రం తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. అందులో తాజాగా కేంద్రం కీలక మార్పులు చేర్పులు చేసింది. చందాదారుడు సమర్పించే.. సబ్‌స్క్రైబర్ రిజిస్ట్రేషన్ ఫారాన్ని మార్చినట్లు వెల్లడించింది. పాత పద్ధతి ప్రకారం 2025, సెప్టెంబర్ 30వ తేదీ వరకే రిజిస్ట్రేషన్లు ముగిశాయని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2025, అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త ఫారం తీసుకు వచ్చినట్లు తెలిపింది.ఈ పథకాన్ని అత్యంత సులభతరం చేయడం కోసమే ఈ సంస్కరణ ఉద్దేశ్యమని స్పష్టం చేసింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి సవరించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) ఫారం మాత్రమే రిజిస్ట్రేషన్ కోసం ఆమోదిస్తున్నట్లు చెప్పింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలను అనుసరించి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తగిన మార్పులు చేసినట్లు వివరించింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పటి వరకు ఉన్న రిజిస్ట్రేషన్ ఫార్మాట్‌ను సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగించడం లేదని వివరణ ఇచ్చింది. ఎందుకంటే.. సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ ప్రోటీన్ (గతంలో %చీాఱా%) పాత ఫార్మేట్‌ను ఆమోదించదని తెలిపింది.దేశంలోని వ్యాపారులు, గిగ్ వర్కర్లు సహా పెన్షన్ పథకం పరిధిలోకి రాని ఉద్యోగులు ఈ పథకంలో చేరవచ్చు. అయితే ఖాతాదారుడు.. బ్యాంకు లేదా పోస్టాఫీసులో అకౌంట్ కలిగి ఉండాల్సి ఉంటుంది. భారతీయ పౌరులు ఎవరైనా ఈ పథకంలో చేరవచ్చని పేర్కొంది. కానీ ఆదాయపు పన్ను చెల్లించే వారికి ఇందులో చేరే అర్హత లేదని క్లియర్ కట్‌గా స్పష్టం చేసింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులు. ఇక ఖాతాదారుకు 60 సంవత్సరాలు వచ్చినప్పటి నుంచి పెన్షన్ అందనుంది. నెలకు రూ.210 చొప్పున చెల్లిస్తే గరిష్ఠంగా రూ. 5 వేలు వరకు పెన్షన్ పొందే వీలు ఉంది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006